www.navatelangana.com
నవతెలంగాణ
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
ఆదివారం 28 మే 2023

పద్మ-2024 అవార్డులకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ- ఆసిఫాబాద్ రూరల్

పద్మ-2024 అవార్డుల కొరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కళా రంగం, అక్షరాస్యత, విద్య, క్రీడ, వైద్య రంగాలు, సామాజిక బాధ్యత, సైన్స్-ఇంజనీరింగ్, ప్రజల వ్యవహారాలు, పౌర సేవలు, కార్మిక, పరిశ్రమల రంగాలలో విశేష సేవలు అందించిన జిల్లా ప్రజలు అవార్డు కొరకు దరఖాస్తు చేసుకోవచ్చని, ఇందుకోసం ఆన్‌లైన్‌లో రాష్ట్రీయ పురస్కార్ పోర్టల్ అవార్డ్స్.గౌ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా 2023 సెప్టెంబర్ 15వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవచ్చని, సంబంధిత రంగాలలో విశేష సేవలు అందించిన వారు అవార్డుకు అర్హులని తెలిపారు.

రేవయ్యకు నేతకాని సంఘం సన్మానం

తాండూర్ : సివిల్స్‌లో ఉత్తమ ర్యాంకు సాధించిన రెబ్బెన మండలం తుంగడ గ్రామానికి చెందిన రేవయ్యను మండల నేతగాని సంఘం అధ్యక్షులు విజయ్ ఆధ్వర్యంలో సన్మానించారు. మారుమూల గ్రామంలో పేద కుటుంబంలో జన్మించిన రేవయ్య కుటుంబ పరిస్థితులను అధిగమించి సివిల్స్‌లో మంచి ర్యాంకు సాధించడం అభినందించదగ్గ విషయమన్నారు. సర్వీస్‌లో పేదల సంక్షేమంతో పాటు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సంఘం ప్రధాన కార్యదర్శి దాగం పాపయ్య, అంబేద్కర్ సంఘ అధ్యక్షుడు జాడి పోశం, నాయకులు వెంకటేశం, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, గంగారాం గంధం పాపయ్య ఆకాంక్షించారు.



పంచాయతీ సెక్రటరీలను ప్రభుత్వం గుర్తిస్తుంది



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పంచాయతీ సెక్రటరీల కష్టాన్ని ప్రభుత్వం గుర్తిస్తుందని, ఇందులో భాగంగానే రెగ్యులరైజేషన్ ఉత్తర్వులు విడుదల నిర్ణయం తీసుకున్నట్లు ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. తమ సర్వీస్ రెగ్యులరైజేషన్ చేయడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో పంచాయతీ సెక్రటరీలు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణ ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయంలో ఎమ్మెల్యే ఆత్రం సక్కు, జెడ్పీటీసి అరిగెల నాగేశ్వరరావు, ఎంపీపీ మల్లికార్జున్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీ సెక్రటరీల కష్టాన్ని ప్రభుత్వం గుర్తిస్తుందని, ఎక్కడ కూడా నిరాశ చెందకుండా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా నాయకులు తిరుపతి, సంతోష్, లావణ్య, దేవిక, దివ్య, సుమలత, హరీష్, ప్రసాద్, రాందాస్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయిలో జిల్లా జట్టు రాణించాలి



నవతెలంగాణ- నస్పూర్

కబడ్డీ పోటీల్లో రాష్ట్ర స్థాయిలో జిల్లా జట్టు రాణించాలని మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్ అన్నారు.జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో నస్పూర్ మండల కబడ్డీ క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.ఈ మేరకు శనివారం శ్రీరాంపూర్ కాలనీ ప్రగతీ స్టేడియంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి ఈసంపెల్లి రాంచందర్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి సీఎం కప్పు పోటీలకు శిక్షణ పొందుతున్న కబడ్డీ క్రీడాకారులు బాల, బాళికలను నస్పూర్ మున్సిపల్ చైర్మెన్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు నస్పూర్ పట్టణం నుంచి జిల్లా స్థాయిలో రాణించి రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం అభినందనీయమన్నారు. గ్రామీణ స్థాయిలోని క్రీడాకారులను ప్రోత్సహించడానికే సీఎం కేసీఆర్ తెలంగాణా సీఎం కప్పు పోటీలు నిర్వహిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో అనిల్, బీఆర్ఎస్ నాయకులు బండి తిరుపతి పాల్గొన్నారు.

గ్రామాల వారీగా దశాబ్ది ఉత్సవాలు జరుపుకోవాలి



నవతెలంగాణ-జైపూర్

జూన్ 2 నుండి 22 వరకు గ్రామాల వారీగా దశాబ్ది ఉత్సవాలు జరుపుకోవాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బాల్క సుమన్ ఆదేశాల మేరకు శనివారం బీఆర్ఎస్ కోఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీల వారీగా సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. అదేవిధంగా ఈ నెల 9న కలెక్టరేట్ భవన సముదాయాల ప్రారంభోత్సవంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలకు సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేస్తున్నందున గ్రామీణులు భారీగా తరలివెళ్లాలని పేర్కొన్నారు. మండల పరిధిలో గ్రామ పంచాయతీల వారిగా స్థానిక ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో వార్డు సభ్యులు, కార్యకర్తలు, గ్రామ పంచాయతీ ప్రజలు తరలివచ్చేందుకు సిద్ధం కావాలని సూచిస్తున్నారు.

న్యూట్రిషన్ ఫ్లస్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ



నవతెలంగాణ-కాగజ్‌నగర్

న్యూట్రిషన్ ఫ్లస్ ఆధ్వర్యంలో కాగజ్‌నగర్ పట్టణంలోని తెలంగాణ తల్లి చౌరస్తాలో శనివారం మజ్జిగ పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ అంజయ్య, టౌన్ ఎస్ఐ అంజన్న, రాజ్యలక్ష్మి, వైద్యులు సాయివివేక్ ఈ మజ్జిగ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండుటెండలో ప్రజల దాహార్తి తీర్చేందుకు ప్రతీ వారం మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయమని అన్నారు. తమ సేవలను గ్రామాలకు కూడా విస్తరించనున్నట్లు నిర్వాహకులు డాక్టర్ సుమిత్ వారికి వివరించడంతో అభినందించారు. ఈ కార్యక్రమంలో టీం సభ్యులు ప్రకాష్ ఖట్వాని, రాహుల్ బియాని, నికురె నాగేందర్, రాజన్న, నీలి సతీష్, ఫారూఖ్, కార్తీక్, దేవా, లక్ష్మి, నీలం బియాని, పూజ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి కబ్జా

పట్టించుకోని అధికారులు

నవతెలంగాణ- జన్నారం

మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వెనకాల ఉన్న సర్వేనెంబర్ 374లో గల ఐదు ఎకరాల 8 గంటల ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతోంది. ఇప్పటికే చాలా భూమి కబ్జా అయిందని పట్టణవాసులు ఆరోపిస్తున్నారు. కొంతమంది నాయకులు గ్రూపుగా ఏర్పడి ఆలయాల పేరుతో ప్రభుత్వ భూమిలో ఆలయాలు కట్టించి పక్కనే ఉన్న భూముల్లో గుడిసెలు వేసి పేదవారికి అప్పజెప్పు వారి వద్ద నుంచి లక్షల రూపాయలు తీసుకొని సొమ్ము చేసుకుంటున్నారని పలువురు పేర్కొంటున్నారు.



యథేచ్ఛగా కబ్జా..?

మండల కేంద్రంలో కొందరు నాయకులు ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు మాత్రం డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించడానికి స్థలం లేదనే సాకుతో మండలంలో ఇప్పటివరకు ఇండ్ల నిర్మాణాలు చేపట్టలేదు. పేద ప్రజలకు అండగా నిలవాల్సిన ప్రజాప్రతినిధులు భూములు కబ్జాలు చేస్తున్న వారితో చేతులు కలిపి ముడుపులు దండుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి, మండల కేంద్రంలోని సర్వే నెంబర్ 374లో ఉన్న ప్రభుత్వ భూమిని కాపాడాలని మండల వాసులు కోరుతున్నారు.



కబ్జా చేస్తే చట్టపరంగా చర్యలు : ఇట్యాల కిషన్, తహసీల్దార్

సర్వేనెంబర్ 374లో భూమే కాకుండా ఎక్కడ ప్రభుత్వ భూములు కబ్జా చేసినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. 374 సర్వే నెంబర్ కలిగిన ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మించిన కట్టడాలను కూల్చివేస్తాం.

రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి : ఎస్పీ సురేష్‌కుమార్

నవతెలంగాణ- ఆసిఫాబాద్

జూన్ 2 నుండి 22వ తారీకు వరకు నిర్వహించే తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని జిల్లా ఎస్పీ సురేష్ కుమార్ పోలీస్ అధికారులకు సూచించారు. దశాబ్ది ఉత్సవాలపై ఏఆర్ హెడ్ క్వార్టర్స్ లో పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో చేపట్టే పలు కార్యక్రమాలను అధికారులకు వివరించారు. దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా జూన్ 4న సురక్ష దినోత్సవం తో పాటు జూన్ 12వ తేదీన పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. దీనిలో భాగంగా చేపట్టే తెలంగాణ రన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. దశాబ్ది ఉత్సవాలకు ఎక్కడ భంగం కలగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు.



సివిల్స్ ర్యాంకర్‌కు సన్మానం

సివిల్స్ ర్యాంకు సాధించిన రేవయ్యను ఎస్పీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో ఆసిఫాబాద్ డిఎస్పి శ్రీనివాస్, కాగజ్ నగర్ డిఎస్పి కరుణాకర్, జిల్లాలోని సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

వరి పంట కొనుగోళ్లు చేపట్టాలి

నవతెలంగాణ-తాండూర్

వరి పంట కొనుగోళ్లను చేపట్టాలని టిపిసిసి సభ్యులు, నియోజకవర్గ ఇన్చార్జ్ చి లుముల శంకర్ అన్నారు. శనివారం కాంగ్రెస్ అధ్యక్షుడు సూరం దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని ద్వారక కాసిపేట గ్రామ వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి రైతుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. స్థానిక మిల్లర్లను అధికార యంత్రాంగం సమన్వయం చేయకపోవడం వల్లే రైతులకు ఇబ్బందులు కలుగుతున్నాయని తెలిపారు. దీంతో రైతులు ప్రైవేటు వ్యాపారులకు పంటను అమ్ముకొని గిట్టుబాటు ధర రాక నష్టపోతున్నారని తెలిపారు. స్థానిక మిల్లర్లు ఏదో ఒక సాకుతో కొనుగోళ్లను నిలుపుదల చేస్తూ రైతుల వద్ద నుండి ప్రైవేటుగా తక్కువ ధరకు పంటలను కొంటున్నారని ఆరోపించారు. గత్యంతరం లేని పరిస్థితిలో రైతులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించి నష్టపోతున్నారని తెలిపారు. రైతుల వద్ద నుండి వరి పంట కొనుగోళ్లను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ కవితకు కొనుగోళ్ల విషయమై వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డిసిసి సభ్యులు గట్టు మురళీధర్‌రావు, రొడ్డ శారద, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు ముడిమడుగుల మహేందర్, తాండూర్ సహకార సంఘం ఉపాధ్యక్షులు కడారి రత్నాకర్‌రావు, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కాపర్తి సుభాష్, కన్నెపల్లి మండల అధ్యక్షుడు ఏల్పుల రోహిత్,యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు పుట్ట శ్రీనివాస్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి షేక్ మోమిన్ పాల్గొన్నారు.



జూన్ 5నుండి రెండో విడత గొర్రెల పంపిణీ ప్రారంభం

- జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు
- లబ్దిదారులకు అవగాహన కార్యక్రమం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జూన్ 5 నుండి రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమం ప్రారంభవుతుందని జెడ్పిటిసి అరిగెల నాగేశ్వరరావు అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి సురేష్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన రెండో విడత గొర్రెల పంపిణీ అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జూన్ 5 నుండి రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమం ప్రారంభమవుతుందని, లబ్దిదారులు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏ రాష్ట్ర ప్రభుత్వం చేయని రీతిలో తమ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. గొర్రెల పంపిణీ ద్వారా యాదవుల ఆర్థిక అభివృద్ధి జరుగుతుందన్నారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి సురేష్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమంలో భాగంగా 1508 మందిని గుర్తించామని వీరిలో 485 మంది లబ్దిదారులు తమ వాటా మొత్తం రూ.43,700 కలెక్టర్ అకౌంట్లో జమచేయడం జరిగిందని, వీరికి జూన్ 5 నుండి మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణాజిల్లా నుండి గొర్రెల కొనుగోలు ప్రారంభిస్తామని తెలిపారు. గొర్రెల పంపిణీకి జిల్లా వ్యాప్తంగా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక టీములు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి మండలానికి ఒక జిల్లా అధికారిని ఇన్చార్జిగా నియమించడం జరిగిందని, ఈ అధికారి ఆధ్వర్యంలో పంపిణీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంపీపీ మల్లికార్జున్ మాట్లాడుతూ లబ్దిదారులు తమ వాటా మొత్తాన్ని తొందరగా జమ చేయడంతో పాటు, వారి కుల ధృవీకరణ పత్రం, ఆధార్, బ్యాంకు పాస్‌బుక్, నామిని ధ్రువీకరణ పత్రాలను, మరణించిన లబ్దిదారులు డిపెండెంట్, డెత్ సర్టిఫికెట్స్, నామిని ధృవీకరణ పత్రాలను మండలాల పశువైద్యాధికారికి అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య అధికారి డాక్టర్ మురళీకృష్ణ, సర్పంచులు భీమేష్, మహేష్, నాయకులు పెంటయ్య లబ్దిదారులు పాల్గొన్నారు.

వీఓఏల సమ్మెకు సంఘీభావం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

డిమాండ్ల సాధన కోసం ఐకేపీ వీఓఏలు కాగజ్‌నగర్‌లోని ఐకేపీ కార్యాలయం ముందు చేపడుతున్న సమ్మె శనివారం నాటికి 41వ రోజుకు చేరుకుంది. శనివారం సీఐటీయూ జిల్లా నాయకులు వెలిశాల కృష్ణమాచారి సమ్మె శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో 20 ఏళ్లగా పని చేస్తున్న వీఓఏల సమస్యల పరిష్కారం పట్ల ప్రభుత్వం స్పందించకపోవడం సరికాదని అన్నారు. వారిని సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతనాలు అందించాలని డిమాండ్ చేశారు.



అన్ని వర్గాలను మోసం చేస్తున్న కేసీఆర్ సర్కారు

- బీజేపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కె శ్రీనివాస్



నవతెలంగాణ-కాగజ్‌నగర్

రాష్ట్రంలోని కేసీఆర్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కె శ్రీనివాస్ అన్నారు. శనివారం కాగజ్‌నగర్‌లో నిర్వహించిన మోర్చాల సమ్మేళన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అతివృష్టి, అనావృష్టి వల్ల పంటలు సరిగా పండక, గిట్టుబాటు ధర లేక రైతులు ఆత్మహత్యలు చేసుకున్నా ఈ ప్రభుత్వానికి చీమ కుట్టినట్లయినా లేదని అన్నారు. తెలంగాణ వస్తే దళితున్ని ముఖ్యమంత్రి చేస్తానని చెప్పిన కేసీఆర్ మాట మార్చి ఇప్పటికి రెండు సార్లు సీఎం పీఠం అధిరోహించాడని అన్నారు. కుటంబపాలన కొనసాగిస్తూ రాష్ట్ర ఖజానాను ఖాళీ చేస్తూ స్వంత ఖజానా నింపుకుంటున్నాడని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు దోని శ్రీశైలం, మురళీధర్, ఉపాధ్యక్షులు చన్నపురి గణపతి. ఈర్ల విశ్వేశ్వర్‌రావు, నాయకులు ఎస్ లక్ష్మి, గోలెం వెంకటేశం, ఎలగతి సుచిత్, కుమ్మరి తిరుపతి, కోవ విజయ్ పాల్గొన్నారు.

పోగొట్టుకున్న మొబైల్ అప్పగించిన పోలీసులు



నవతెలంగాణ-లక్షెట్టిపేట్

పోగొట్టుకున్న ఫోన్‌ని సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి బాధితునికి శనివారం ఎస్సై లక్ష్మణ్ అప్పగించారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం పోలీస్‌స్టేషన్ పరిధి కొత్తూర్‌కు చెందిన గోల్ల వెంకన్న ఫోన్ మూడు రోజుల క్రితం ఎక్కడో పడిపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వెంటనే స్పందించిన పోలీసులు సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసి 3 రోజులలో మొబైల్‌ని రికవరీ చేసి శనివారం బాధితునికి అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్సై లక్ష్మణ్ మాట్లాడుతూ ఎవరైన సెల్ ఫోన్‌ను పోగొట్టుకుంటే ఫోన్ వివరాలు స్టేషన్‌కి వచ్చి ఫిర్యాదు ద్వారా సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఈ పోర్టల్ ద్వారా మొబైల్ తిరిగి పొందే అవకాశం ఉందని, అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది రమేష్, రవి ఉన్నారు.

కంపోస్టు ఎరువును మొక్కల ఎదుగుదలకు వినియోగించాలి



నవతెలంగాణ-జైపూర్

గ్రామ పంచాయతీల వారీగా సెగ్రిగేషన్ షెడ్డులో తయారు చేస్తున్న కంపోస్టు ఎరువును నర్సరీ, పల్లె ప్రకృతి వనంలో పెంచుతున్న మొక్కలకు వినియోగించాలని డీఎల్‌పీఓ ప్రభాకర్‌రావు సూచించారు. మొబైల్ యాప్ ఇన్స్‌పెక్షన్‌లో భాగంగా శనివారం రామారావుపేట్ గ్రామ పంచాయతీని సందర్శించిన ఆయన గ్రామ పంచాయతీకి సంబంధించిన శ్మశాన వాటిక సెగ్రిగేషన్ షెడ్డు, నర్సరీలో మొక్కలు పెంచుతున్న తీరును పరిశీలించారు. శ్మశాన వాటిక పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని స్థానిక సర్పంచ్ నామాల సత్యవతి తిరుపతి, గ్రామ పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. ప్రతి రోజు గ్రామ పంచాయతీ రోడ్లు, మురుగు కాలువలు శుభ్రం చేయించాలని, ఇంటింటి చెత్త సేకరణ, పారిశుధ్య పనులు నిరంతరాయంగా చేపట్టాలని సూచించారు. ప్లాస్టిక్, చెత్త లేకుండా చూసుకోవాలని, ప్లాస్టిక్ చెత్త సేకరించినప్పుడు దాన్ని విక్రయించి గ్రామ పంచాయతీ బ్యాంకు ఖాతాలో జమ చేయాలని తెలిపారు. ఇంటి పరిసరాల్లో, రోడ్డు పక్కన ప్లాస్టిక్, ఇతర వ్యర్థ పదార్థాలు వేస్తున్న వారిని గుర్తించి జరిమానా విధించాలని ఆదేశించారు. అదేవిధంగా పగటి పూట వీధి దీపాలు వెలగకుండా చూడడంతో పాటు వేసవి ఎండలు తీవ్రంగా ఉన్నందున మొక్కలకు సాయంత్ర పూట నీరు పోయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ అనిల్ కుమార్, సర్పంచ్ నామాల సత్యవతి, కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైద్య కళాశాల తరగతులు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలి

ఆసిఫాబాద్: 2023-24 విద్యా సంవత్సరానికి గాను రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన వైద్య కళాశాలలలో తరగతులు ప్రారంభించే విధంగా చర్యలు చేపట్టి పనులు పూర్తిచేయాలని రాష్ట్ర ఆరోగ్యశాఖ కార్యదర్శి రిజ్వి అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, టిఎస్ఎంఎస్ ఐడీసీ ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, వైద్య కళాశాలల ప్రిన్సిపాళ్ళు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, టి ఎస్ఎంఎస్ ఐడిసి ఇంజనీర్లతో వైద్య కళాశాలల నిర్మాణం, వసతుల కల్పన అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆరోగ్య కార్యదర్శి రిజ్వి మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను వేగవంతంగా అందించేందుకు వైద్యులు, సిబ్బంది సంఖ్యను పెంచే విధంగా రాష్ట్రవ్యాప్తంగా వైద్య కళాశాలలు ప్రారంభించడం జరుగుతుందని, ఈ క్రమంలో చేపట్టిన కళాశాలల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేసే విధంగా అధికారులు కృషి చేయాలని తెలిపారు. వీసీలో జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రామకృష్ణ, వైద్య కళాశాల ప్రిన్సిపల్ నాగార్జున చారి, టిఎస్ ఎంఎస్ ఐడిసి ఇంజనీర్లతో కలిసి హాజరయ్యారు.

ఘనంగా శ్రీవెంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవం

నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని భరంపూర్ గ్రామ కొండపై వెలసిన శ్రీవెంకటేశ్వరస్వామి కళ్యాణోత్సవం శనివారం కనుల పండుగగా నిర్వహించారు. ఈ కళ్యాణ మహోత్సవంలో ఎన్నారై చింతలపెల్లి రాజశేఖర్‌రెడ్డి వీణ దంపతుల



ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మెన్ అడ్డి బోజారెడ్డి, మాజీ డీసీసీబీ చైర్మెన్ దామోదర్‌రెడ్డి, పారిశ్రామికవేత్త ప్రేమేందర్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మెన్ కేదరీశ్వర్ రెడ్డి, గ్రామస్తులు మల్లేష్, ఆశన్న, చిన్న మల్లేష్, నాగరెడ్డి, పాల్గొన్నారు. అనంతరం గ్రామాల నుంచి వచ్చిన భక్తులుకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

రమాబాయి సేవలు మరువలేనివి

నవతెలంగాణ-బోథ్

డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ సతీమణి మాతా రమాబాయి చేసిన సేవలను మరువలేమని బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు అమృత్‌రావు పటేల్ అన్నారు. శనివారం మండలంలోని సొనాల గ్రామంలో అంబేద్కర్ భవనంలో రమాబాయి స్మృతి దివస్ వర్ధంతిని నిర్వహించారు. అలాగే ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం ప్రధాన కార్యదర్శి మునేశ్వర్ సోమన్న, నేతకాని, మహర్ సంఘం జిల్లా అధ్యక్షుడు కంబ్లే భీమ్‌రావు, సభ్యులు యశ్వంత్‌రావు, గణపతి, గంగాధర్ పాల్గొన్నారు.



ప్లీనరీ పోస్టర్ల ఆవిష్కరణ



నవతెలంగాణ-ఖానాపూర్ రూరల్

జన సమితి మూడో ప్లీనరీ సమావేశాల పోస్టర్లను జిల్లా అధ్యక్షుడు తిలక్‌రావు శనివారం స్థానిక ఆర్ అండ్ బీ విశ్రాంతి భవనంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తిలక్‌రావు మాట్లాడారు. జూన్ నాలుగో తేదీన సూర్యాపేటలో జన సమితి మూడో ప్లీనరీ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశానికి జన సమితి కార్యకర్తలు, బాధ్యులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని ఈశ్వర్‌నగర్ గ్రామానికి చెందిన ఉపాధ్యాయులు జాదవ్ భారత్, వసంత్‌ల మాతృమూర్తి మీనాబాయి ఇటీవల మరణించడంతో శనివారం బాధిత కుటుంబాన్ని జెడ్పీచైర్మెన్ రాథోడ్ జనార్దన్ పరామర్శించారు. శనివారం జరిగిన దశదిన కర్మ కార్యక్రమానికి డీఆర్డీఓ ఏపీడీ రాథోడ్ రవీందర్, డిప్యూటీ సీఈఓ రాథోడ్ రాజేశ్వర్‌లు హాజరయ్యారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఆహ్వానం



నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని తాడిహత్నూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఛత్రపతి శివాజీ మహారాజ్ జూన్ 2న నిర్వహించనున్న విగ్రహావిష్కరణకు రావాలని జెడ్పీ చైర్మెన్ జనార్దన్ రాథోడ్, ఎమ్మెల్యే ఆత్రం సక్కును ఉత్సవ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. ఈ సందర్భంగా శనివారం ఉట్నూర్, ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని వారి స్వగృహానికి వెళ్లి వారి చేతులమీదుగా విగ్రహ ఆవిష్కరణ కరపత్రాలను విడుదల చేశారు. ఆహ్వాన పత్రం అందించిన వారిలో వైస్ ఎంపీపీ చంద్రశేఖర్ జాదవ్, ఉపసర్పంచ్ విష్ణు ఉత్సవ కమిటీ సభ్యులు విశాల్ కోటగిరి, సురేష్ కేంద్రే, విశాల్, న్యానేశ్వర్, జాదవ్ విజయ్ కుమార్ ఉన్నారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-బోథ్



మండలంలోని సొనాల గ్రామానికి చెందిన రెహమాన్ బాబా ఇటీవల మృతి చెందాడు. శనివారం వారి కుటుంబ సభ్యులకు తుల శ్రీనివాస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో రూ.10వేలను ఆర్థిక సాయాన్ని అందించారు. అలాగే బాధిత కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున మరిన్ని సహాయ సహకారాలు అందించేందుకు తనవంతు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో తుల శ్రీనివాస్ వెల్ఫేర్ సొసైటీ ఉపాధ్యక్షుడు ఇర్ల అభిలాష్, సభ్యులు సుధీర్‌రెడ్డి, హరీష్, గౌతమ్‌రెడ్డి, సాయిరెడ్డి పాల్గొన్నారు.

సోయా విత్తనాలు సబ్సిడీ ద్వారా అందించాలి : బీజేపీ

నవతెలంగాణ-జైనథ్

సోయా విత్తనాలు సబ్సిడీ ద్వారా అందించాలిని బీజేపీ మండల మోర్చ ఆధ్వర్యంలో శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు సోయాబీన్ విత్తనాలు సబ్సిడీ ద్వారా అందించాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు రైతులకి సబ్సిడీ విత్తనాలు అందించిందని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాడ్డాక రైతుబంధు అందించి, విత్తనాలపై సబ్సిడీ ఎత్తివేసిందని అన్నారు. గతంలో రైతులకి వ్యవసాయ పనిముట్లను స్ప్రింక్లర్ సెట్లను అందించేదని అన్నారు. ఇప్పుడున్న ఈ ప్రభుత్వం రైతులకి ఎటువంటి పథకాలను కూడా సమకూరుస్తలేదని అన్నారు. గత సంవత్సరం విక్రాంత్ విత్తనాలు మొలకెత్తక ఎంతో మంది రైతులు నష్టపోయారని వారికి ఇప్పటి వరకు కూడా నష్ట పరిహారం ఇవ్వలేదని అన్నారు. వ్యవసాయశాఖ అధికారులు కంపెనీ వాళ్లతో కలిసిపోయి రైతుని మోసం చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కరుణాకర్‌రెడ్డి, మండల అధ్యక్షులు రాందాస్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు ఏనుగు రాకేష్‌రెడ్డి, ప్రతాప్, లింగారెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.

29న ఇంటర్ స్పాట్ అడ్మిషన్లకు కౌన్సెలింగ్

నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంలోని ఏకలవ్య గురుకులం కళాశాలలో 2023 సంవత్సరంలో పదోతరగతి పాసైన గిరిజన విద్యార్థులకు ఇంటర్ మొదటి సంవత్సరంలో స్పాట్ అడ్మిషన్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ఆర్సీఓ గంగాధర్, కళాశాల ప్రిన్సిపల్ ఉపేందర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీసీ, బైపీసీ సీఈసీ గ్రూప్‌లో 30 సీట్ల చొప్పున ప్రవేశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు మండల కేంద్రంలోని ఏకలవ్య గురుకులం కళాశాలలో ఒరిజినల్ ధృవీకరణ పత్రాలతో హాజరు కావాలని సూచించారు.

గ్రామస్థాయిలో బీజేపీ బలోపేతానికి కృషి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

గ్రామస్థాయిలో బీజేపీ బలోపేతానికి ప్రతి కార్యకర్త సైనికుల్లా కృషి చేయాలని మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక కాగ్నె ఫంక్షన్ హాల్‌లో సిరికొండ, ఇంద్రవెల్లి రెండు మండలాల పరిధిలోని కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రజలకోసం గ్రామీణ ఉపాధి హామీ పథకం, సర్వశిక్ష అభియాన్, ఇంటింటికీ మరుగుదొడ్ల నిర్మాణం, ఉజ్వల పథకం కింద ఉచితంగా వంట గ్యాస్ పంపిణీ వంటి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టడం జరిగిందని అన్నారు. ఆ పథకాలను తెలంగాణ సీఎం పేర్లు మార్చి తామే ఇస్తున్నామంటూ ప్రజలకు అబద్ధపు మాటలతో ప్రచారం చేయడం ఎంతవరకు సమంజసమని అన్నారు. కేంద్రప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రతి ఒక్క పథకాన్ని గ్రామస్థాయిలో బూత్ లెవెల్ ప్రచారం చేయాలని సూచించారు. పథకాలమో బీజేపీవని, ప్రచారమేమో గులాబీ పార్టీదని ఎద్దేవ వేశారు. ఇప్పటి నుంచి ప్రతి కార్యకర్త బీజేపీ సంక్షేమ పథకాలను ప్రతితండ, ఆదివాసీ గూడెల్లో ముమ్మరంగా ప్రచారం చేయాలని కోరారు. రాబోయే ఎన్నికల్లో ఖానాపూర్ నియోజకవర్గంలో బీజేపీ జెండాను ఎగురవేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ అర్క పుష్పలత, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాళ్లబండి మహేందర్, జిల్లా కార్యదర్శి కొండేరి రమేష్, సిరికొండ జెడ్పీటీసీ రఘురాం, ఎంపీపీ అమృత్‌రావు, సీడాం భీమ్ రావ్, మదినే సురేందర్, అరెల్లి రాజలింగం, రాథోడ్ భీమ్‌రావ్, లహనే గిరి పాల్గొన్నారు.

దశాబ్ది వేడుకలు ఘనంగా నిర్వహించాలి

- ఉత్సవాలపై కలెక్టర్ సమీక్షా సమావేశం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. శనివారం పట్టణంలోని టీఎన్జీఓ హాల్‌లో దశాబ్ది ఉత్సవ వేడుకల నిర్వహణపై గ్రామ, మండల, జిల్లా స్థాయి అధికారులకు నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జూన్-2 నుండి 22 వరకు 21 రోజుల పాటు నిర్వహించే రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. సంబంధిత శాఖల అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేసి రోజువారి కార్యక్రమాలను విజయవంతం చేయాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ఆదిలాబాద్ జిల్లా అన్ని రంగాల్లో విప్లవాత్మక మార్పులు సాధించిందని తెలిపారు. వివిధ రంగాలలో జిల్లాకు జాతీయ స్థాయి అవార్డులు రావడం జరిగిందని తెలిపారు. దశాబ్ది ఉత్సవ వేడుకల నిర్వహణలో భాగంగా నిర్వహించే కార్యక్రమాలలో రాష్ట్రం ఏర్పడిన నాటి నుండి ఇప్పటి వరకు గ్రామ, మండల, జిల్లా స్థాయిలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని తెలిపారు.

21 రోజుల పాటు దశాబ్ది వేడుకలు...

జూన్-2న దశాబ్ది ప్రారంభోత్సవంలో భాగంగా పతాకావిష్కరణ, అమరులకు నివాళి, 3న రైతు దినోత్సవం, 4న పోలీస్ శాఖ ద్వారా సురక్ష దినోత్సవం, 5న విద్యుత్ విజయోత్సవం, 6న పారిశ్రామిక ఉత్సవం, 7న సాగునీటి దినోత్సవం, 8న చెరువుల పండగ, 9న సంక్షేమ సంబురాలు, 10న సుపరిపాలన దినోత్సవం, 11న సాహిత్య దినోత్సవం, 12న తెలంగాణ రన్, 13న మహిళా సంక్షేమ దినోత్సవం, 14న వైద్యారోగ్య దినోత్సవం, 15న పల్లె



ప్రగతి దినోత్సవం, 16న పట్టణ ప్రగతి దినోత్సవం, 17న గిరిజనోత్సవం, 18న మంచి నీళ్ల పండుగ, 19న హరితోత్సవం, 20న విద్య దినోత్సవం, 21న ఆధ్యాత్మిక దినోత్సవం, 22న అమరులకు నివాళులు వంటి కార్యక్రమాలను ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని సూచించారు. అనంతరం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పురోగతిని దశాబ్ది వేడుకల సందర్భంగా నిర్వహించే కార్యక్రమాలపై శాఖల వారిగా చర్చించారు. ఈ సమావేశంలో శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మహతో, జిల్లా అటవీ అధికారి రాజశేఖర్ పెట్ల, అదనపు ఎస్పీ శ్రీనివాస్‌రావు, ఆర్డీఓలు రమేష్ రాథోడ్, కదం సురేష్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఏపీఓలు, ఏపీఎంలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకే కార్డెన్ సెర్చ్‌లు

- బైంసా రూరల్ సీఐ చంద్రశేఖర్



నవతెలంగాణ-కుభీర్

ప్రజలకు అందుబాటులో ఉండి శాంతిభద్రతల పరిరక్షణకే పోలీసులు ఉన్నారని బైంసా రూరల్ సీఐ చంద్రశేఖర్ అన్నారు. శనివారం మండలంలోని సాంగ్వి గ్రామ పంచాయతీలో జిల్లా ఎస్పీ ప్రవీణ్ కుమార్ ఆదేశాల మేరకు బైంసా సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ కార్డెన్ సెర్చ్‌లో సీఐ, ఇద్దరు ఎస్సైలు హెడ్ కానిస్టేబుళ్లు ఆరుగురు, ప్రత్యేక బృందం 30 మందితో తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా గ్రామంలో పోలీసులు బృందాలుగా విడిపోయి ఇంటి ఇంటికి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బైంసా రూరల్ సీఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రజల రక్షణ భద్రత భావం కల్పించేందుకు పోలీసులు ఉన్నారని తెలిపారు. అదే విధంగా గ్రామంలో కొత్త వ్యక్తులు కాని, నేరస్తులు కాని, వచ్చినట్లుగా కనిపిస్తే పోలీసులుకు సమాచారం అందించాలని అన్నారు. దీనితో పాటు గంజాయి మొక్కలు, విక్రయాలు జరిగినట్లు తెలిస్తే వారిపై కఠిన చర్యలు కేసులు నమోదు చేస్తామని అన్నారు .గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు చేసుకుంటే అన్ని విధాలుగా ఉపయోగాలు ఉంటాయని అన్నారు. వాహనదారులు వాహనాన్ని కొనుగోళ్లు చేసేటప్పుడు తప్పని సరిగా వాహనానికి సంబంధించిన పత్రాలు సరిచూసుకోవాలని అన్నారు. ఈ తనిఖీల్లో సరైన ధృవపత్రాలు లేని వాహనాలు 71 మోటార్‌సైకిళ్లు3 ఆటోలు పట్టుకొని సీజ్ చేసినట్టు తెలిపారు. వాహనానికి సంబంధించిన పత్రాలు లైసెన్స్‌లు కలిగి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ దత్తుగౌడ్, కుభీర్ ఎస్సై షరీఫ్, పోలీసులు, గ్రామస్తులు ఉన్నారు.

విత్తన నాణ్యత కోసం కోల్డ్ స్టోరేజీలను ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-ఇచ్చోడ

విత్తన నాణ్యత కోసం కోల్డ్ స్టోరేజీలను ఏర్పాటు చేయాలని రైతు స్వరాజ్యవేదిక జిల్లా అధ్యక్షులు సంగెపు బొర్రన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో రైతు సంఘం నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు సోయాబిన్ విత్తనాలను కోల్డ్ స్టోరేజ్‌లో ఉంచినట్లయితే విత్తనాలు దెబ్బ తినకుండా, విత్తనాలపైన ఉండే పొట్టులాంటిది ఊడిపోకుండా ఉంటుందని, మన రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ పథకం ద్వారా ఇచ్చే విత్తనాలను ఎత్తివేయడంతో రైతులందరు కూడా ప్రయివేట్ విత్తనాల డీలర్స్ దగ్గర నుండి కొనుగోలు చేస్తున్నారని అన్నారు. కానీ ఏది నాణ్యమైన విత్తనామో తెలియకుండా రైతులు తీసుకున్న సందర్భం కనిపిస్తుందని అన్నారు. విత్తనాలపైన పొట్టు ఊడిపోవడంతో తమ పంట చేనులలో వేసుకున్న తరువాత విత్తనాలు మొలకెత్తకపోవడంతో ఆర్థికంగా నష్టపోవడం జరుగుతుందని అన్నారు. వ్యవసాయ సైంటిస్టులు చెప్పిన దాని ప్రకారంగా ఒక పక్క వ్యవసాయ అధికారులు, విత్తనాల డీలర్లు సిండికేటు అయి, విత్తనాల డీలర్లు ఒక్కొక్క బ్యాగ్ మీద బలంగా మరొక బ్యాగ్ వేయడం ద్వారా



విత్తన నాణ్యత కూడా ఉండలేకుండా పోతుందని అన్నారు. ఒక పక్క రైతుని రాజుగా చేస్తామని చెప్పిన రాష్ట్రప్రభుత్వం మరొక పక్క రైతుని పాలేరుగా మార్చేటటువంటి పరిస్థితి కనబడుతుందని పేర్కొన్నారు ఈ సమావేశంలో రైతు నాయకులు మోహన్ సింగ్, గంగాధర్, కైలాస్ ఉన్నారు.

పంచాయతీ కార్మికులకు వేతనం రూ.19వేలు చెల్లించాలి



నవతెలంగాణ-నిర్మల్

గ్రామపంచాయతీ వర్కర్స్‌కు పీఆర్సీ కమిటీ నివేదిక ప్రకారం బేసిక్ వేతనం రూ.19వేలు చెల్లించాలని, తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కే.రాజన్న అన్నారు. గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర జేఏసీ ఇచ్చిన పిలుపులో భాగంగా శనివారం జిల్లాలోని వివిధ గ్రామపంచాయతీ వర్కర్లతో కార్యదర్శి, సర్పంచ్‌లకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చెత్తా, చెదారం, మురికి కాలువలు, ఈగల, దోమల మధ్య తమ ఆరోగ్యాలను, ప్రాణాలను పణంగా పెట్టి, చాలీచాలని వేతనాలతో పని చేస్తూన్నారని అన్నారు. కుటుంబ పోషణ భారమై ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా పీఆర్సీ నివేదిక ప్రకారం బేసిక్ వేతనం రూ.19వేలు చెల్లించాలని అన్నారు. ఇతర సమస్యలు పరిష్కరించా లని అన్నారు. గ్రామపంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలని అన్నారు. గ్రామపంచాయతీ సిబ్బంది వేతనాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక గ్రాంట్‌ను ఏర్పాటు చేయాలని అన్నారు. దాని నుండే గ్రామ పంచాయతీ సిబ్బందికి వేతనాలు చెల్లించాలని అన్నారు. 2011 జనాభా ప్రాతిపదికన కాకుండా ప్రస్తుత జనాభా ప్రాతిపదికన గ్రామపంచాయతీ కార్మికులను నియమించాలని, ప్రతి నెల రెగ్యులర్‌గా వేతనాలు చెల్లించాలని అన్నారు. పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని, జీఓ నెంబర్ 51 సవరించాలని అన్నారు. మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలని అన్నారు. వివిధ కేటగిరీలన్నింటినీ కొనసాగించాలని అన్నారు. కారోబారి, బిల్ కలెక్టర్లకు ప్రత్యేక హోదా కల్పించాలని, వారికి పంచాయతీ అసిస్టెంట్‌లుగా గుర్తించాలని అన్నారు. ప్రతి వర్కర్‌కు రూ.5లక్షలు ఇన్సూరెన్స్, ప్రమాద బీమా రూ.10లక్షలు సౌకర్యం కల్పించాలని అన్నారు. చనిపోతే దహన సంస్కారాలకు రూ.30 వేలు చెల్లించాలన్నారు. వయస్సు మీరిందనే సాకుతో కార్మికులను మారిస్తే ఆకుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని అన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్‌గా రూ.5లక్షలు చెల్లించాలని అన్నారు. సంవత్సరానికి మూడు జతలు యూనిఫామ్‌లు, చెప్పులు, సబ్బులు, నూనెలు ఇవ్వాలని అన్నారు. వాటికి నగదు రూపంలో అలవెన్స్‌లు చెల్లించాలని అన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, 8 గంటల పని దినం అమలు చేయాలని అన్నారు. ఆదివారం, పండుగ సెలవులు జాతీయ, అంతర్జాతీయ సెలవు దినాలను వర్తింపజేయాలని అన్నారు. అక్రమ తొలగింపులు నిలుపుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు ఏం.బక్కన్న, జిల్లా కార్యదర్శి ఆర్. రామలక్ష్మన్, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి టి.నాగన్న, ఆర్.సాయన్న, రవి, పోశెట్టి, రాజేందర్, నర్సవ్వ గ్రామ పంచాయతీ సపాయి కార్మికులు పాల్గొన్నారు.

మాలీల ఎస్టీ హోదాను రాజకీయం చేయొద్దు

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

మాలీ కులస్తులది సామాజిక సమస్యని దానిని ఏ రాజకీయ పార్టీ కూడా రాజకీయం చేయొద్దని మాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుకుమార్ పెట్కూలే అన్నారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు మాలీలకు ఎస్టీ హోదా కల్పించి తమకు సామాజిక న్యాయం చేకూర్చాలని డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని పూలే గెస్ట్ హౌస్‌లో ఏర్పాటు చేసిన మాలీ పటేళ్ల సంఘ సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పటేళ్ల వ్యవస్థను పటిష్టం చేయబోతున్నామని అన్నారు. కొంతమంది కుల ధృవీకరణ పత్రాలు, కళ్యాణలక్ష్మి లాంటి సంక్షేమ పథకాల లబ్ధిదారులు మాలీ సంఘ కుల పెద్దల సంతకాలు ఫోర్జరీ చేసి లబ్ధి పొందుతున్నట్లు సమాచారం అందిందని ఆరోపించారు. సదరు విషయమై జూన్ 5న జిల్లా కలెక్టర్, సంబంధిత తహసీల్దారులను కలిసి మాలీ కుల పెద్దల సంతకాలతో వినతిపత్రాలను అందించబోతున్నామని పేర్కొన్నారు. కుల పెద్దలు పెట్టిన సంతకాన్ని మాత్రమే పరిగణలోకి తీసుకొని ఇతరులు చేసిన సంతకాలను రెవిన్యూ అధికారులు రిజెక్ట్ చేయాలని కోరనున్నట్లు తెలిపారు. తద్వారా మాలీ సంఘాన్ని పటిష్టం చేసి ఎస్టీ హోదా సాధించేవరకు ఉద్యమాలు కొనసాగిస్తామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి ఆమోదం కోసం కేంద్రానికి పంపిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా ఆలస్యం చేయకుండా రాబోయే పార్లమెంటు సమావేశాల్లో బిల్లు పెట్టి మాలీలకు ఎస్టీ హోదా కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే గిరిజన రిజర్వేషన్లను 10 శాతానికి పెంచుతూ ఆమోద ముద్ర వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాలీ మహా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబన్న షిండే, జిల్లా పటేళ్ల సంఘం అధ్యక్షులు గంగారాం షిండే, జిల్లా అధ్యక్షులు వాడగురే విజయ్, ఉద్యోగ సంఘాల అధ్యక్షులు అంబేకర్ చంద్రశేఖర్, గురునులే వినోద్, షిండే విలాస్, ప్రధాన్ శంకర్, యువజన సంఘాల నాయకులు మాందాడే ఉత్తం, గంగారాం చౌదరి పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ భవనం ప్రారంభం

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఎస్సీ కమ్యూనిటీ హాల్ భవనాన్ని శనివారం ఎమ్మెల్యే రేఖా శ్యామ్ నాయక్ ప్రారంభించారు. ముందుగా డా. బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం రూ.25 లక్షలు ఎమ్మెల్యే నిధులచే నిర్మించిన కమ్యూనిటీ భవనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పుష్పలత, ఎంపీపీ శోభ, జిల్లా కోఆప్షన్ సభ్యులు అంజద్, పీఏసీఎస్ చైర్మెన్ మారుతీ డోంగ్రే, నాయకులు దేవ్ పూజే, మారుతి, సర్కాలే శివాజీ పాల్గొన్నారు.

బోనమెత్తి నిరసన తెలిపిన వీఓఏలు



నవతెలంగాణ-నిర్మల్

జిల్లా కేంద్రంలో గత 39 రోజుల నుంచి ఐకేపీ వీఓఏలు నిరవధిక సమ్మె చేస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం వీఓఏలు బోనాలెత్తి నిరసన తెలిపారు. ఇప్పటికైనా చర్చలకు పిలిచి సమస్య పరిష్కరించాలని కోరారు. ఐకేపీ వీఓలకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని అన్నారు. సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. పర్మినెంట్ చేయాలని అన్నారు. లేనిపక్షంలో అసెంబ్లీ ముట్టడి చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. వీరికి సీఐటీయూ జిల్లా కోశాధికారి లలిత, జిల్లా సభ్యులు వెస్లీ, ఐకేపీ వీఓఏల సంఘం జిల్లా కార్యదర్శి సాయన్న, ఉపాధ్యక్షులు ప్రభాకర్, గంగాధర్, గోవింద్, గాయత్రి, సునీత, ముత్యం సాహెందర్, కృష్ణవేణి, లావణ్య పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

పట్టణంలోని 40వ వార్డు పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను శనివారం మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ పర్యవేక్షించారు. సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనులను పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ మాట్లాడుతూ పట్టణంలోని అన్ని వార్డుల్లో అభివృద్ధి కార్యక్రమాలు జోరుగా కొనసాగుతున్నాయని అన్నారు. ప్రజా ఇక్కట్ల పరిష్కారమే లక్ష్యంగా కోట్లాది రూపాయల నిధులతో పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. మౌలిక వసతుల కల్పనతో సహా పట్టణ సుందరీకరణే లక్ష్యంగా కృషి చేస్తున్నామని స్పష్టం చేశారు. ఆయన వెంట వార్డు కౌన్సిలర్ భరత్, సిబ్బంది ఉన్నారు.

కప్ కొట్టాలి.. జిల్లాకు పేరు తేవాలి..

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్రస్థాయి సీఎం కప్ క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు హైదరాబాద్‌కు వెళ్తున్న జిల్లా జట్టు క్రీడాకారుల బస్సులను స్థానిక ఇందిర ప్రియదర్శిని స్టేడియంలో డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డితో కలిసి శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మహతో జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చిన విధంగానే రాష్ట్ర స్థాయిలోను ప్రతిభ కనబర్చలని జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్, జిల్లా క్రీడాల శాఖాధికారి వెంకటేశ్వర్లు, ఒలంపిక్ క్రీడల జిల్లా అధ్యక్షులు బి.గోవర్ధన్‌రెడ్డి, గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యం

నవతెలంగాణ-ముథోల్

బీజేపీతోనే దేశం, రాష్ట్రాల అభివృద్ధి సాధ్యమవుతుందని ముథోల్ నియోజకవర్గ బీజేపీ నాయకులు మోహన్‌రావు పటేల్ అన్నారు. శనివారం మండలంలోని ఎడ్‌బిడ్, గ్రామాలలో నిర్వహించిన గడపగడపకు బీజేపీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గడపగడపకు వెళ్లి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. రానున్న రోజుల్లో తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం రావడం ఖాయమని అన్నారు. దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు, రైతులకు కేంద్ర ప్రభుత్వం మోడీ సర్కార్ ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి ఆదుకుంటుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం వలన ప్రజలకు మేలు చేసింది ఏమి లేదని అన్నారు. మాటల గారడి తప్ప కేసీఆర్ చేసిందేమి లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సుభాష్ జాదవ్, నాయకులు నిమ్మ పోతన్న, జీవన్, రాంచందర్ రెడ్డి, ఉదయ్ కుమార్, సాయినాథ్, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల సంబరాలు

నవతెలంగాణ-ముథోల్

తెలంగాణ ప్రభుత్వం పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేస్తున్నట్లు ప్రకటించటంతో మండల పంచాయతీ కార్యదర్శులు శనివారం సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు అఫ్రోజ్ ఖాన్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, ఎంపీడీఓ సురేష్ బాబు, మండల సిబ్బందికి పంచాయతీ కార్యదర్శులు స్వీట్‌లను పంపిణీ చేశారు. సీఎం కేసీఆర్‌కు కార్యదర్శులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రేపటి భూమిపూజ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్



జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించనున్న మాదిగ సంక్షేమ సంఘ స్థల భూమిపూజ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాదిగ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చందాల రాజన్న, గలిపెల్లి నాగన్న కోరారు. శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన ఎలక్ట్రానిక్ మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ మే 29న ఉదయం 11 గంటలకు మాదిగ సంక్షేమ సంఘ స్థల భూమిపూజ కార్యక్రమం ఉంటుందని అన్నారు. ఆ కార్యక్రమానికి ఎమ్మెల్యే జోగు రామన్న ముఖ్యఅతిథిగా హాజరవుతారని ఆయన చేతుల మీదుగానే భూమిపూజ కార్యక్రమం నిర్వహించబడుతుందని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న మాదిగలు వివిధ రవాణా మార్గాల్లో డప్పు వాయిద్యాలతో పెద్ద సంఖ్యలో తరలిరావాలని అన్నారు. మాదిగ సంక్షేమం కోసం కృషి చేస్తున్న మేధావులు, బడుగు, బలహీన వర్గాల ప్రజలు కార్యక్రమంలో విధిగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో మాదిగ సంక్షేమ సంఘం కోశాధికారి మాల్యాల మనోజ్, మాదిగ యువసేన జిల్లా నాయకులు బిక్కి గంగాధర్, దర్శనాల నగేష్, కోరాటి ప్రభాకర్, దర్శనాల అశోక్, జివ్వాక నర్సింలు, కొల్లూరి స్వామి పాల్గొన్నారు.

మహార్ సంఘం లోగో ఆవిష్కరణ

నవతెలంగాణ-కాగజ్‌నగర్



తెలంగాణ మహార్ సంఘం లోగోను శనివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ ఆవిష్కరించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాడి దీపక్‌తో కలిసి లోగోను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మహార్ కులస్తులు వెనుకబడి ఉన్నారని, వారి ఐక్యత కోసం కృషి చేస్తున్న జాడి దీపక్ అభినందనీయుడని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు సూరన్న, మేడి కార్తీక్, దుర్గం విశాల్ పాల్గొన్నారు.

పురుగులమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-బెజ్జూర్

పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్నట్టు బెజ్జూర్ ఎస్సై వెంకటేశ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చిన్న సిద్దాపూర్ గ్రామానికి చెందిన టాకిర్ నారాయణ(50) అనే వ్యక్తి కడుపునొప్పి భరించలేక శనివారం తెల్లవారు జామున పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య టాకిర్ సంతర్‌బాయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్టు ఎస్సై తెలిపారు.



తాగునీటి కోసం బావిలో పడ్డ గిరిజన మహిళలు

- ఒకరి పరిస్థితి విషమం.. ఇద్దరికి తీవ్ర గాయాలు



నవతెలంగాణ-జైనూర్

గిరిజన గ్రామంలో ఆదివాసీ గిరిజనులకు తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శనివారం మండలంలోని గౌరీ కొలాంగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని దేవ్‌గూడ గ్రామంలో తాగునీటి కోసం వెళ్లి గిరిజన మహిళలు బావిలో పడి తీవ్రంగా గాయపడ్డారు. నీటిని తోడుతున్న సమయంలో బావికి అడ్డుగా పెట్టిన కర్ర మొద్దులు విరిగిపోవడంతో ముగ్గురు గిరిజన మహిళలు బావిలో పడిపోయారు. వారిలో ఆత్రం జైతుబాయి, ఆత్రం సోము బాయి, సిడాం ముత్తుబాయికి తీవ్ర గాయాలయ్యాయి. బావిలో పడిపోవడంతో స్థానిక యువకులు, గ్రామస్తులు ముగ్గురు మహిళలను తాడు సాయంతో సురక్షితంగా బయటకు తీశారు. అనంతరం జైనూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చారు. వారికి ప్రథమ చికిత్స అందించగా ముగ్గురిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉండటంతో ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్టు కొలాం సంఘం అధ్యక్షుడు ఆత్రం రాజు తెలిపారు.

మిషన్ భగీరథ పైపులైన్ మరమ్మతులు చేయించాలి



నవతెలంగాణ-సిర్పూర్(టి)

మిషన్ భగీరథ పైపులైన్ మరమ్మతులు చేయాలని సిర్పూర్‌లోని 6వ వార్డులో అరబ్‌మొహల కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం కాలనీవాసులు గ్రామ పంచాయతీ ఈఓ కృష్ణమూర్తికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ కాలనీకి మిషన్ భగీరథ పైపులైన్ సరిగా లేనందున సరిపడా నీరు రావడంలేదని, వెంటనే మరమ్మతు పనులు చేపట్టాలని అన్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే రాబోయే వర్షాకాలంలో తీవ్రమైన ఇబ్బంది ఏర్పడుతుందని, వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలన్నారు. అలాగే మండలకేంద్రంలోని పలు కాలనీలకు కూడా ఇదే పరిస్థితి ఉందని, మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ ఉన్న ప్రదేశంలో సందర్శించి వాటిని గుర్తించి మరమ్మత్తులు చేయించాలని కాలనీవాసులు ఎంఎ తాజ్, ఎస్‌కె సయ్యద్, ఎస్‌కె భరత్, హిజర్‌హుస్సేన్, జెలిల్ ఈఓను కోరారు.

ఘనంగా రమాబాయి 88వ వర్ధంతి

నవతెలంగాణ-వాంకిడి

మండలకేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో రమాబాయి అంబేద్కర్ 88వ వర్ధంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలకేంద్రంలోని జశ్వంత్ బుద్ధవిహార్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండలంలోని కమాన, కన్నర్‌గావ్, ఇందాని, బంబారా, ఎనగొంది, సరండి గ్రామాల్లో వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం నాయకులు విలాస్, జయరాం, పాండు పాల్గొన్నారు.

తెలంగాణ దశాబ్ది ఉత్సవాల నిర్వహణపై సమీక్ష



నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియా గోలేటిలోని జీఎం కార్యాలయంలో జీఎం జి.దేవేందర్ అన్ని విభాగాల అధిపతులతో శనివారం ఆశాబ్ది ఉత్సవాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను(దశాబ్ది ఉత్సవాలను) ఘనంగా నిర్వహించాలన్నారు. అంతకుముందు చైర్మన్ ఐఎఎస్ ఎన్ శ్రీధర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉత్సవాల నిర్వహణపై పలు మార్గ నిర్దేశకాలు చేశారు. చైర్మన్ ఆదేశాలు, సూచనలు జీఎం అన్ని విభాగాల అధిపతులకు వివరించారు. కాగా జూన్ 2, 5వ తేదీల్లో నిర్వహించనున్నవేడుకల ఎజెండా నిర్వహణ బాగుండాలని ఆదేశించారు. వేడుకల కోసం మైదానాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం కేహెచ్ఎన్ గుప్తా, ఏజీఎం తిరుమలరావు, డీజీఎం సివిల్ ఆర్ సతీష్‌బాబు, పర్సనల్ మేనేజర్ ఐ.లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

ఆదాయం పన్ను ఆప్షన్-1 గడువు పొడగింపు

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియా సింగరేణి ఉద్యోగులకు 2023-24 ఆర్థిక సంవత్సరానికి ఆదాయపు పన్ను ఆప్షన్స్-1 ఇవ్వడానికి 26 జూన్ 2023 వరకు పొడిగించడమైనదని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి.సంజీవరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్యోగులు తమ యొక్క ఆప్షన్ వారు పనిచేసే గని లేదా డిపార్ట్మెంట్‌లో అందచేయవలసిందిగా కోరారు.

వేజ్‌బోర్డు ఒప్పందంపై దుష్ప్రచారం సరికాదు



నవతెలంగాణ-రెబ్బెన

మెరుగైన వేజ్‌బోర్డు దుష్ప్రచారం చేస్తున్న సంఘాలకు బుద్ధి చెప్పాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ అన్నారు. శనివారం గోలేటి సీహెచ్‌పీలో నిర్వహించిన గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో ఏ ప్రభుత్వ రంగ సంస్థలో లేని వేజ్‌బోర్డు ఒప్పందం బొగ్గు పరిశ్రమలు చేయించామన్నారు. ఇతర పరిశ్రమల్లో 10 సంవత్సరాలు ఉంటే బొగ్గు పరిశ్రమలో 5 సంవత్సరాలకే కాలపరిమితి ఉండాలని ఒప్పందం చేశామని చెప్పారు. మెరుగైన వేజ్‌బోర్డు ఒప్పందం కాంట్రాక్టు కార్మికులకు హైపర్‌కమిటీ వేతనాలు అమలు కోసం ఒప్పందం చేశామని వివరించారు. దీనికన్న మెరుగైన ఒప్పందం ఏదైనా ఉంటే విమర్శిస్తున్న నాయకులు చెప్పాలన్నారు. ఒప్పందంపై సంతకాలు చేసిన రియాజ్ సిగ్గులేకుండా మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ నెల 20న కోల్‌కతాలో జరిగిన వేజ్‌బోర్డు ఒప్పందంపై మెరుగైందని బొగ్గు గని కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. దేశంలో ఇతర ప్రభుత్వ రంగ సంస్థలో 10 సంవత్సరాల కాలపరిమితి ఉండి 12 నుండి 15 శాతం వేతనాల పెరుగుదల ఉంటే బొగ్గు పరిశ్రమలో 5 సంవత్సరాల కాలపరిమితికి ఒప్పించి 19 శాతం వేతనాల పెరుగుదలతో పాటు 25 శాతం అలవెన్స్‌లు పెంచి ఒప్పందం చేస్తే ఈ వేజ్‌బోర్డు ఒప్పందం సరిగాలేదని, కార్మికులకు నష్టమని, అవగాహన లేని టీబీజీకేయస్ యూనియన్ విమర్శలు చేయడం సరైందికాదని మండిపడ్డారు. జేబీసీసీఐ ఒప్పందాలు అమలుచేయించని టీబీజీకేయస్ యూనియన్ కార్మికులకు నష్టం చేస్తూ జాతీయ కార్మిక సంఘాలను విమర్శించే అర్హత లేదన్నారు. ఈ ఒప్పందం సంతకం చేసిన హెచ్‌ఎంఎస్ నాయకులు రియాజ్ జాతీయ కార్మిక సంఘాలపై విమర్శలు చేయడం సరికాదని విమర్శించారు. ఇకనైనా వేజ్‌బోర్డు ఒప్పందంపై జాతీయ కార్మిక సంఘాలపై విమర్శలు చేయడం మానుకోవాలని వారు హితవు పలికారు. సమావేశంలో గోలేటి ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సోమారం తిరుపతి, ఏఐటీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు భయ్య మొగిళి, ఆర్గనైజింగ్ కార్యదర్శులు జగ్గయ్య, శివరావు, కిరణ్‌బాబు, ఉయిక చంద్రశేఖర్, ఆనంద్, ఫిట్ కార్యదర్శులు వెంకటేశం, రఘునాథ్‌రెడ్డి, కందుల మల్లేష్, రామయ్య శంకర్, శ్రీనివాస్, లచ్చన్న పాల్గొన్నారు.

సివిల్స్ ర్యాంకర్ రేవయ్యకు సన్మానం



నవతెలంగాణ-రెబ్బెన

ఇటీవల విడుదలైన ఆలిండియా సివిల్స్ సర్వీసెస్‌లో 410వ ర్యాంకు సాధించిన కుమురంభీం జిల్లా రెబ్బెన మండలంలోని తుంగెడ గ్రామానికి చెందిన డోంగ్రి రేవయ్యను ఆసిఫాబాద్ ఎస్పీ కె సురేష్‌కుమార్ శనివారం పోలీస్ హెడ్‌క్వార్టర్‌లో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృషి, పట్టుదల ఉంటే ప్రతి ఒక్కరు విజయం సాధించగలరని అని తెలియజేయడానికి డోంగ్రి రేవయ్య ప్రత్యక్ష నిదర్శనమన్నారు. ఒక మారుమూల గ్రామమైన తుంగెడ పల్లెటూరి గ్రామానికి చెందిన ఒక సాదారణ వ్యక్తి సివిల్స్ సర్వీసెస్ సాధించడం ప్రతి ఒక్కరికి స్ఫూర్తినిస్తుందని తెలిపారు. యువత రేవయ్యను స్ఫూర్తిగా తీసుకొని జీవితంలో మంచి విజయాలు సాధించాలన్నారు. రేవయ్యను సన్మానించిన బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఇటీవల సివిల్స్ ఫలితాలో జాతీయస్థాయిలో 410వ ర్యాంకు సాధించిన ఐఎఎస్ డోంగ్రి రేవయ్యను ఆయన తల్లి డోంగ్రి ఇస్తారుబాయిని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య తుంగెడలో ఆయన ఇంటి వద్ద ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నేతకానీ కులానికి జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చిన రేవయ్యను నిరుపేద పరిస్థితిలో ఉండి ఐఎఎస్ సాధించిన రేవయ్యను అభినందించారు. కార్యక్రమంలో రెబ్బెన ఎంపీపీ జుమ్మిడి సౌందర్య ఆనంద్, దుర్గం భరద్వాజ్, గ్రామస్తులు పాల్గొన్నారు. నేతకానీ మహర్ సంఘం ఆధ్వర్యంలో రేవయ్యను, తల్లి ఇస్తారుబాయిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు జాడి నర్సయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కౌటాల ఎంపీపీ బసార్కర్ విశ్వనాత్, ఆసిఫాబాద్ కుమురంభీం జిల్లా మహిళా అధ్యక్షుడురాలు, రెబ్బెన ఎంపీపీ జుమ్మిడి సౌందర్య ఆనంద్ పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ : పట్టుదలతో చదివితే జీవితంలో ఏదైనా సాధించవచ్చని నిరూపించిన డొంగ్రి రేవయ్యను నేటి విద్యార్థి లోకం ఆదర్శంగా తీసుకోవాలని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోషియేషన్ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ సూచించారు. శనివారం ఆయన ఫోన్ ద్వారా రేవయ్యకు అభినందనలు తెలిపారు. పరిస్థితులు ఎలా ఉన్నా, పట్టుదల, ప్రణాళికబద్ధంగా ముందుకు పోతే ఖచ్చితంగా విజయం సాధించవచ్చని రేవయ్య నిరూపించాడని పేర్కొన్నారు.



సమీకృత కలెక్టరేట్ భవనం త్వరగా పూర్తి చేయాలి



నవతెలంగాణ-నస్పూర్

సమీకృత కలెక్టరేట్ భవన నిర్మాణం త్వరిత గతిన పూర్తి చేయాలని మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శనివారం జిల్లాలోని నస్పూర్ మండల కేంద్రంలో నిర్మిస్తున్న కలెక్టరేట్ నిర్మాణ పనులు జిల్లా అటవీ అధికారి శివ్‌ఆశిష్‌సింగ్, అదనపు కలెక్టర్లు డి.మధుసూదన్‌నాయక్, బి.రాహుల్, డీసీపీ. సుధీర్ రామ్నాథ్ కేకన్, మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావుతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. కలెక్టరేట్ భవనంలో జిల్లా శాఖల కార్యాలయాలు, వివిధ సేవల నిమిత్తం కలెక్టరేట్కు వచ్చే ప్రజలు వేచి ఉండే ప్రాంతాలు, భవన ఆవరణ, సమావేశ మందిరం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వ సేవలన్నీ ఒకే చోట అందించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం చేపట్టిన సమీకృత కలెక్టరేట్ భవనాల నిర్మాణాలలో భాగంగా జిల్లాలో చేపట్టిన కలెక్టరేట్ పనులను వేగవంతం చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని, అంతర్గత రహదారులు, గ్రీన్ కారిడార్, మురుగు కాలువల వ్యవస్థ, త్రాగునీరు, విద్యుత్ సరఫరా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. సమీకృత జిల్లా శాఖల కార్యాలయాల సముదాయం ద్వారా జిల్లా శాఖల కార్యాలయాలు ఒకే చోట ఉండటంతో ప్రజలకు ప్రభుత్వ సేవలు ఎలాంటి జాప్యం లేకుండా వేగంగా అందుతాయని, కార్యాలయాలకు తిరిగే అవస్థలు తొలగుతాయని తెలిపారు. సంబంధిత అధికారులు ప్రతి రోజు పనులను పర్యవేక్షిస్తూ త్వరగా పూర్తి చేసి ప్రారంభించేందుకు సిద్ధం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల రాజస్వ మండల అధికారి దాసరి వేణు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి బి.శేషాద్రి పాల్గొన్నారు.

ప్రజా గర్జన విజయవంతం చేయాలి

నవతెలంగాణ-రెబ్బెన

సింగరేణి ప్రయివేటీకరణ, కాంట్రాక్టీకరణకు వ్యతిరేకంగా జూన్ 4వ తేదీన కొత్తగూడెంలో నిర్వహించే ప్రజా గర్జన ముగింపు కార్యక్రమానికి సింగరేణి కార్మికులు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య పిలుపునిచ్చారు. గోలేటి ఏఐటీయూసీ కార్యాలయం(కేఎల్) మహేంద్రభవనంలో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలోనే బొగ్గుగని కార్మికులకు మెరుగైన వేతన ఒప్పందం సాధించామని, ఆలస్యం జరిగినా కూడా ఏ ప్రభుత్వ రంగ పరిశ్రమలో లేని విధంగా 5 సంవత్సరాల కాలపరిమితితో 19 శాతం మినీమం గ్యారెంటీ బెనిఫిట్స్‌తో 25 శాతం అలవెన్స్, పెరుగుదల యాజమాన్యంతో ఒప్పందం కుదుర్చుకోవడం జరిగిందన్నారు. 2017 వేజ్‌బోర్డు నుండి అధికారులకు గ్రాడ్యూటీ అమలుచేయడం జరుగుతుందన్నారు. అదేవిధంగా కార్మికులకు 2016 వేజ్‌బోర్డు నుండి గ్రాడ్యూటీ అమలుచేయాలని కోరిన యాజమాన్యం స్పందించడంలేదన్నారు. దీనిపై కోర్టును ఆశ్రయించి న్యాయ పోరాటం చేస్తామన్నారు. ఈ సందర్భంగా సింగరేణి నుండి వేజ్‌బోర్డులో ప్రాతీనిధ్యం వహించి లాభ దాయకమైన వేజ్‌బోర్డుకు కృషి చేసిన పర్మినెంట్ వేజ్‌బోర్డు సభ్యులు సీతారామయ్యను గోలేటి బ్రాంచ్ ఏఐటీయూసీ నాయకులు ఘనంగా సన్మానించారు. సమావేశంలో డిప్యూటీ ప్రధాన కార్యదర్శి



కె.రాజ్‌కుమార్, గోలేటి బ్రాంచ్ ఇన్‌చార్జి చిప్ప నర్సయ్య, బ్రాంచ్ కార్యదర్శి, ఉపాధ్యక్షుడు సోమారం తిరుపతి, భయ్య మొగిళి, ఆర్గనైజింగ్ కార్యదర్శులు బి జగ్గయ్య, జి శివరావు, మారం శ్రీనివాస్, కిరణ్‌బాబు, చంద్రశేఖర్, ఆనంద్, ఫిట్ కార్యదర్శులు జూపాక రాజేష్, కందుల మల్లేష్, డి.దివాకర్, రఘునాథ్‌రెడ్డి, కాంట్రాక్టు వర్కర్స్ బ్రాంచ్ కార్యదర్శి చల్లూరి అశోక్, సహాయ కార్యదర్శి సాగర్‌గౌడ్, నాయకులు రాజయ్య, శంకర్, ఈఎన్ రాజు, రాంకిశన్, రామయ్య పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఉపాధ్యాయుడు మృతి

నవతెలంగాణ-హాజీపూర్

మండలంలోని గుడిపేట్ ప్రభుత్వ పాఠశాల (ఎంపీపీఎస్)లో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న బోడకుంటి మల్లన్న(48) అనారోగ్యంతో మృతిచెందాడు. దండేపల్లి మండలం నెల్కి వెంకటపూర్‌కు చెందిన మల్లన్న గత పది సంవత్సరాలుగా గుడిపేట్ పాఠశాలలో విధులు మల్లన్న పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగేందుకు చాలా కృషి చేశారు. గ్రామంలో అందరితో కలివిడిగా వుండేవారు. గత ఏడాది కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా ఉపాధ్యాయ సంఘం పీఆర్టీయూ మండల అధ్యక్షునిగా కొనసాగుతున్నారు. మృతునికి భార్య సత్యలీల, కూతురు శిరీష, కుమారుడు అవినాష్‌లు ఉన్నారు. రేపు ఆయన స్వగ్రామం నెల్కి వెంకటపూర్‌లో అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.



వేజ్‌బోర్డు ఒప్పందంలో ఏఐటీయూసీ కీలక పాత్ర



నవతెలంగాణ-జైపూర్

ఇటీవల కుదిరిన 11వ వేజ్ బోర్డు ఒప్పందంలో ఏఐటీయూసీ పాత్ర కీలక పాత్ర పోషించిందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. జైపూర్ సింగరేణి విద్యుత్ థర్మల్ ప్లాంట్‌లో శనివారం సింగరేణి వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాల వల్ల వేజ్‌బోర్డు ఆలస్యమైనప్పటికీ ఏఐటీయూసీ, జాతీయ సంఘాల చొరవతో మెరుగైన వేజ్‌బోర్డు సాధించుకున్నామని తెలిపారు. 19 శాతం మినిమం గ్యారంటీ బెన్ఫిట్, అలవెన్స్‌లపై 25 శాతం పెంచుకోవడం జరిగిందని దీని వల్ల కార్మికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక చర్యలు చేపట్టిందని బొగ్గు గనులు సింగరేణికి దక్కకుండా ప్రైవేట్ వ్యక్తులకు అప్పనంగా దారాదత్తం చేస్తున్న తీరును వ్యతిరేకించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్, ఎస్కే బాజీసైదా, కే వీరబద్రయ్య, కేం. కార్యదర్శి ముస్కె సమ్మయ్య, సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఐకేపీ వీఓఏల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-సిర్పూర్(టి)

రాష్ట్రవ్యాప్తంగా ఐకేపీలో విధులు నిర్వహించే వీఓఏల సమస్యలు పరిష్కరించాలని బీజేపీ సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పాల్వాయి హరీష్‌బాబు డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయం ఎదుట వీఓఏలు చేపట్టిన సమ్మె శిబిరాన్ని సందర్శించి వారికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతకొన్ని రోజుల నుండి నిరవధిక సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం ఆ సమస్యలు పరిష్కరించడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చిన్నస్థాయి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్న చేతకానీ ప్రభుత్వం వెంటనే గద్దె దిగాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళల ఆర్థికంగా అభివృద్ధి కోసం ఎంతో కృషి చేస్తున్న వీఓఏలు ప్రభుత్వం వారితో వెట్టిచాకిరి చేయించుకుంటుందన్నారు. చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్నారని, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా గుర్తించి కనీస వేతనం, ఉద్యోగభద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. బీఆర్ఎస్ పరిపాలనలో రైతులకు, నిరుద్యోగులకు, ప్రభుత్వ ఉద్యోగులకు న్యాయం చేయకుండా తమ పబ్బం గడుపుతోందన్నారు. రాబోవు శాసనసభ ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాటం చేబుతారన్నారు. ఆయన వెంట బీజేపీ మండలాధ్యక్షుడు ఎలుములె శంకర్, నాయకులు శ్యాంరావు, దనార్కర్ సాయి, వీఓఏలు పాల్గొన్నారు.

బీఎస్పీ బహిరంగసభను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

కౌటాల మండలం గుండాయిపేట గ్రామంలో ఈ నెల 29న బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ బహిరంగసభను విజయవంతం చేయాలని నియోజకవర్గ అధ్యక్షుడు కొండా ప్రసాద్ అన్నారు. శనివారం మండలకేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గుండాయిపేట గ్రామంలో బుద్ధవిహార్ ప్రారంభోత్సవంలో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పాల్గొంటారన్నారు. నియోజకవర్గ ప్రజల కోరిక మేరకు సిర్పూర్ నియోజకవర్గం నుండి బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థిగా నియోజకవర్గంలో పోటీ చేయాలని ప్రజలందరు కోరుకుంటున్నారన్నారు. బహిరంగసభకు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో బీఎస్పీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి తామెర బాబాజీ, బీఎస్పీ మండలాధ్యక్షుడు పాగిడె ఆశన్న, నాయకులు దుర్గం ఆశన్న, బాపురావు, నాందేవ్ పాల్గొన్నారు.

సీఎం సభలను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-జన్నారం

సమీకృత కలెక్టరేట్ల ప్రారంభోత్సవానికి ఉమ్మడి జిల్లాకు వస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ సభలను విజయవంతం చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని ఏఆర్ఎస్ కళాశాలలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. కార్యకర్తలు చురుకుగా ఉండి వచ్చే ఎన్నికల్లో మరోసారి బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని తెలంగాణలో తీసుకురావడానికి కృషిచేయాలని సూచించారు. పార్టీ కార్యకర్తలకు, ప్రజలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుతారి వినయ్ కుమార్, మండల పార్టీ అధ్యక్షులు గుర్రం రాజారాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి సులువ జనార్దన్, జిల్లా అధికార ప్రతినిధి సిటీమల భరత్ కుమార్, మండల కోఆప్షన్ సభ్యులు మున్వర్ అలీ ఖాన్, జిల్లా ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు రియాజుద్దీన్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

నవతెలంగాణ-రెబ్బెన



మండలంలోని గోలేటి ఎక్స్‌రోడ్డు వద్ద శనివారం రెబ్బెన ఎస్సై ఎల్.భూమేష్ వాహనాల తనిఖీ నిర్వహించారు. సరైన వాహన ధృవీకరణ పత్రాలు లేని వాహనాలకు జరిమానా విధించారు. సరైన పత్రాలు లేనప్పుడు ఏదైనా ప్రమాదం జరిగితే చాలా ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉంటుందన్నారు. అలాగే ఇన్సూరెన్స్ లేకుంటే గాయపడిన, మరణించిన వారికి తీవ్ర నష్టం జరుగుతుందనే ముందస్తు తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ఎవరైన మైనర్ బాలురు లైసెన్సు లేకుండా వాహనాలు నడిపితే వారి తండ్రులపై కేసులు నమోదుచేస్తామని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు.

బెల్లంపల్లి సీఓఈ విద్యార్థికి ఎయిర్‌క్రాఫ్ట్‌లో సీటు

నవతెలంగాణ- తాండూర్

జాతీయ స్థాయిలో నిర్వహించే ఎయిర్ క్రాఫ్ట్ మెయింటెనెన్స్ ఇంజనీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(ఎయంఈ సెట్ 2023) ఫలితాల్లో3364 ర్యాంకు సాధించిన శ్రీనివాస్ శుక్రవారం ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎయిర్ క్రాఫ్ట్ ఇంజనీరింగ్ ద్వారక (న్యూఢిల్లీ)లో సీటు లభించినట్లు ప్రిన్సిపల్ ఐనాల సైదులు తెలిపారు. ప్రతిష్టాత్మకమైన ఐఐఏఈ న్యూఢిల్లీ లో సీటు సాధించిన శ్రీనివాస్ ను సంక్షేమ గురుకులాల సంయుక్త కార్యదర్శి కంభంపాటి శారద, అధ్యాపకులు చందా లక్ష్మీనారాయణ, సుంకరి అర్జున్, నాగిని శ్రీరామ వర్మమిట్ట రమేష్, కట్ల రవీందర్, సురేష్ గౌడ్, అవునూరి రవి, సిబ్బంది ఐ.మల్లేష్ అభినందించారు.



నేడు సోమినిలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ

నవతెలంగాణ - బెజ్జూర్

మండలంలోని సోమిని గ్రామంలో ఆదివారం అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఉప సర్పంచ్ శంకర్ శనివారం తెలిపారు. విగ్రహావిష్కరణకు అంబేద్కర్ వాదులు, మండల ప్రజలంతా అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ విగ్రహావిష్కరణకు కాగజ్‌నగర్‌కు చెందిన అంబేద్కర్ విగ్రహావిష్కరణ చైర్మన్ రత్నం శ్రీకాంత్, అవంతి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఉదయం పంచశీల జెండా ఆవిష్కరణ అనంతరం అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం ఉంటుందని, మండలవాసులంతా హాజరై విజయవంతం చేయాలని కోరారు.

సేంద్రీయం..నేలకు బలం : కలెక్టర్

నవతెలంగాణ-సారంగాపూర్

సేంద్రీయం..నేలకు బలమని జిల్లా కలెక్టర్ వరుణ్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఐకేపీ భవనం వద్ద స్వయం సహాయక సంఘాల ఉపాధి హామీ చట్టంలో మహిళలకు సేంద్రియ ఎరువులు వాడకం జీవామృతం తయారుపై నిర్వహించే శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. కొన్నాండ్లుగా రైతులు రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు వడకంవల్ల భూసారం దెప్పతిని, పర్యావరణం సైతం కలుషితమై ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని అన్నారు. ఈ సమస్యకు పరిష్కారం సేంద్రియ ఎరువులు వాడకమే మార్గమని అన్నారు. శిక్షకులు సేంద్రియ ఎరువులు వాడకంలో బాగంగా జీవామృతం తయారుపై శిక్షణను ఇచ్చారు. సేంద్రియ ఎరువులు సాగులో పంటలకు కూరగాయలు పెంచడంలో ఆవు పేడ, ఆవు మూత్రం, బెల్లం, శనిగ పిండితో చేసి ఘన జీవామృతం పంటలకు లాభాలు, రసాయన ఎరువులు వల్ల నష్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ విజయలక్ష్మి, ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ రాజేశ్వర్‌రెడ్డి, ఎంపీడీఓ సరోజ, ఎంపీఓ తిరుపతిరెడ్డి, తహసీల్దార్ సంతోష్‌రెడ్డి, ఏపీడీ గోవింద్‌రావు, ఏపీఓ లక్ష్మారెడ్డి, ఏపీఎం మాధురి, హెచ్‌ఆర్ మేనేజర్ సుధాకర్, సర్పంచ్ సుజాత, ఎంపీటీసీ పద్మ, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా మాతా రమాబాయి 88వ వర్ధంతి



నవ తెలంగాణ-లక్షెట్టిపేట్

మాతా రమాబాయి 88వ వర్ధంతి వేడుకలు పట్టణంతో పాటు, పలు గ్రామాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ సంఘ మండల, పట్టణ నాయకులు మాట్లాడుతూ మాతృత్వానికి నిలువెత్తు నిదర్శనం మాతా రమాబాయి జీవితమని, ఎన్నో అవమానాలు ఎదుర్కొని అంబేద్కర్‌ని రాజ్యాంగకర్తగా తీర్చిదిద్దిందన్నారు. అంబేద్కర్ అమెరికా లో ఉన్నత విద్యను అభ్యసించడానికి రమా భాయి ఎన్నో త్యాగాలు చేసి డబ్బులు సర్దుబాటు చేసేవారని వివరించారు. రమా భాయి అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు శనిగారపు లింగన్న, అవునూరి లచ్చన్న, మాలెం చిన్నన్న, మండలాధ్యక్షుడు దొంత నర్సయ్య, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ చిప్పకుర్తి నారాయణ పాల్గొన్నారు.

వేసవి తాపానికి అంబలి మంచిది



నవతెలంగాణ- ఆసిఫాబాద్

జిల్లా కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజల వేసవి తాపం తీర్చడంలో అంబలి ఎంతగానో పనిచేస్తుందని ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. శనివారం వార సంత సందర్భంగా జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో కేసీఆర్ సేవాదళం అధ్యక్షుడు అధ్యక్షుడు ఉబేద్ బిన్ యహీయా (తారిక్) ఆధ్వర్యంలో అంబలి పంపిణీ కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు అంబలి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారసంత సందర్భంగా జిల్లా కేంద్రానికి వివిధ మండలాల నుండి వచ్చే ప్రజల దాహార్తిని తీర్చడానికి అంబలి పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎండి రవుఫ్, ముబారక్ బహద్ర, ఇర్ఫాన్ బిన్ ఇమాద్, ఆదిల్ బిష్ కీఫ్, సయిాద్ యాఫాయి, అబ్దుల్ అకిబ్, అబ్దుల్లా, ముత్తు పాల్గొన్నారు.

పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించడం సరికాదు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ మండలంలోని యాపల్‌గూడ గ్రామం వద్ద గల ప్రతిపాదిత రేణుక సిమెంట్ ఫ్యాక్టరీ భూముల విషయంలో పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించడాన్ని బీజేపీ సహించదని ఎంపీ సోయం బాపూరావు, పార్టీ జిల్లా అధ్యక్షులు పాయల్ శంకర్ అన్నారు. ఈ సందర్భంగా ఎంపీ సోయం బాపూరావు నివాసంలో విలేకరులతో మాట్లాడారు. రైతులను మోసం చేసి మాయమాటలు చెప్పి తీసుకున్న భూములను వెంటనే తిరిగి ఇచ్చేయాలని అన్నారు. గతంలో జిల్లా కలెక్టర్ ఈ విషయమై రైతులకు సానుకూలంగా ఉత్తర్వులు జారీ చేశారు. కానీ అది అమలు కాకముందే వారు బదిలీ అయ్యారని అన్నారు. రైతుల జీవితాలతో ఆడుకుంటున్న స్థానిక ఎమ్మెల్యే జోగు రామన్న వెంటనే రేణుక సిమెంట్ ఫ్యాక్టరీ పనులను ప్రారంభించాలని లేదా రైతులకు వారి భూములను తిరిగి ఇవ్వాలని అన్నారు. రైతుల జీవితాలు బాగుపడతాయని వారి పిల్లలకు ఉద్యోగాలు వస్తాయని నమ్మి చట్టాలను సవరించి అనుమతులు ఇచ్చింది కేంద్ర ప్రభుత్వం కానీ తమ స్వార్థం కోసం రేణుకా సిమెంట్ ఫ్యాక్టరీని ప్రారంభించకుండా రైతులకు అన్యాయం చేస్తున్నారని అన్నారు. వాస్తవానికి 420 కేసు పీడీ యాక్ట్ పెట్టాల్సింది రేణుక సిమెంట్ యాజమాన్యంపై ఎమ్మెల్యే జోగు రామన్నపై వారి కుటుంబ సభ్యులపై అంతేగాని రైతులపై కాదని అన్నారు. రైతులకు వెంటనే వారి భూములను అప్పగించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

తాండూరు పీహెచ్‌సీలో సంబరాలు

తాండూరు : తెలంగాణ వైద్య ఆరోగ్య శాఖలో కాంట్రాక్టు సిబ్బందిగా విధులు నిర్వర్తిస్తున్న వారిని ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయడంతో తాండూర్ పీహెచ్సీలో శనివారం కాంట్రాక్టు సిబ్బంది సంబరాలు జరుపుకున్నారు. ప్రభుత్వం ద్వారా అందిన రెగ్యులరైజ్ ఉత్తర్వుల కాపీని వైద్యాధికారి కుమారస్వామికి అందించారు. రెగ్యులరైజ్ చేయడంతో తమపై మరింత బాధ్యత పెరిగిందని తమ విధులను సక్రమంగా నిర్వర్తిస్తామని వారు పేర్కొన్నారు. తాండూర్ పీహెచ్సీలో ఫార్మసిస్ట్ స్నేహ, ల్యాబ్ టెక్నీషియన్ హకీమ్, హెల్త్ అసిస్టెంట్లు దనుంజయ్, శ్రీనివాస్ లు పాల్గొన్నారు .

మతం మారిన గిరిజనులను షెడ్యూల్డ్ తెగల జాబితా నుండి తొలగించాలి

ఆదిలాబాద్‌టౌన్ : మతం మారిన గిరిజనులను షెడ్యూల్డ్ తెగల జాబితా నుండి తొలగించాలని ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు సోయం బాపురావు అన్నారు. అందులో భాగంగానే ఈ నెల 29న పట్టణంలోని రాంలీలా మైదానంలో జనజాతి సురక్షా మంచ్ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా శనివారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజనుల సంస్కృతి, సాంప్రదాయాలను దెబ్బతీసే విధంగా ఇతర మతంలోకి మారుతున్నారని అన్నారు. మళ్లీ ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా లబ్దిపొందడంతో నిజమైన ఆదివాసీ గిరిజనులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోందన్నారు. రాజ్యాంగంలో మార్పు తీసుకుని వచ్చే విధంగా, ప్రతి గిరిజనుడు తన గళాన్ని వినిపించేవిధంగా గిరిజన సంస్కృతి పరిరక్షణ సమ్మేళనం కృషి చేస్తోందని అన్నారు.

చలో కొత్తగూడెం విజయవంతం చేయాలి



నవతెలంగాణ- నస్పూర్

ప్రైవేటీకరణ,కాంట్రాక్టీకరణపై కొత్తగూడెంలో సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) కేంద్ర కార్యదర్శి ముస్కె సమ్మయ్య అన్నారు.శ్రీరాంపూర్ ఏరియా సహాయ కార్యదర్శి గునిగంటి నర్సింగరావు అధ్యక్షతన ఆర్కే5 గని పై చలో కొత్తగూడెం పోస్టర్లను శనివారం విడుదల చేశారు. అనంతరం సమ్మయ్య మాట్లాడుతూ 11వ వేజ్ బోర్డు అమలు అయ్యిందని, కార్మికులు ఆనందంగా ఉన్నారన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక చర్యలు చేస్తుందని,దానిలో భాగమే బొగ్గు గనులు సింగరేణికి దక్కకుండా ఓపెన్ టెండర్ల ద్వారా ప్రైవేట్ వ్యక్తుల చేతికి గనులు పోయే విధంగా చట్టాలు మారుస్తున్న పరిస్థితి ఉందని పేర్కొన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 చట్టాలను నాలుగు కోడ్‌ల కిందికి మార్చి కార్మికులను కట్టు బానిసలుగా చేస్తున్నారని, దేశంలో ప్రభుత్వ రంగాలైన బొగ్గు రంగంతో సహా అన్నిటిని లేకుండా చేస్తున్నారని విమర్శించారు. ఇలాంటి పరిస్థితులలో 11వ రోజు మినిమం గ్యారంటీ బెనిఫిట్ 19శాతం తో పాటు 25 శాతం పెరగడం చారిత్రక ఘనవిజయమని తెలిపారు. హక్కులు, సౌకర్యాలు జాబ్ సెక్యూరిటీ ,ప్రమోషన్లు ఉండాలంటే ప్రైవేటీకరణ కాంట్రాక్టీకరణపై రాజీ లేని పోరాటం చేయాల్సిన అవసరం ఉందని, అందువల్ల ఏఐటీయూసీ ఆధ్వర్యంలో లక్ష మందితో కొత్తగూడెంలో భారీ ర్యాలీ, బహిరంగ సభ ఉంటుందని పేర్కొన్నారు. కార్మికులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గునిగంటి నర్సింగరావు, శ్రీరాంపూర్ ఏరియా సహాయ కార్యదర్శి,పిట్ కార్యదర్శి రంగిశెట్టి శ్రీనివాస్, కాంట్రాక్ట్ కార్మిక సంఘం రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, ఏఐటియుసి మండల కార్యదర్శి కాంట్రాక్ట్ కార్మిక సంఘం రీజియన్ నాయకులు దొడ్డిపట్ల రవీందర్, ట్రేడ్స్ మెన్ ఇంచార్జ్ నంబయ్య, సదానందం, రవీందర్, శ్రీనివాస్, రాజన్న, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు పిల్లలను ప్రోత్సహించాలి

- సివిల్స్ ర్యాంకర్ రేవయ్య



నవతెలంగాణ ఆసిఫాబాద్

తల్లిదండ్రులు తమ పిల్లలను ఎప్పటికప్పుడు ప్రోత్సహిస్తే మంచి ఫలితాలు వస్తాయని సివిల్స్ ర్యాంకర్ రేవయ్య అన్నారు. సివిల్స్ ర్యాంక్ సాధించిన నేపథ్యంలో జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నప్పుడే తండ్రిని కోల్పోయి ఇబ్బందులు పడ్డామని, తల్లి మధ్యాహ్న భోజనం కార్మికురాలిగా పనిచేస్తూ తమను పోషించిందన్నారు. తాను ఐఐటి సాధించినప్పుడు అప్పటి ఉమ్మడి జిల్లా కలెక్టర్ అశోక్‌కుమార్ ప్రోత్సాహంతో చదవగలిగానని, తదనంతరం కూడా తన చదువుకు అనేకమంది సహకరించారని వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నో సందర్భాల్లో తన లక్ష్యాన్ని విడిచిపెట్టడానికి నిర్ణయించుకున్నప్పటికీ తన తల్లి ప్రోద్బలంతో లక్ష్యం దిశగా అడుగులు వేశానన్నారు. పిల్లలకు తల్లిదండ్రులు తాము పడుతున్న కష్టాన్ని తెలియజేయాలని, కానీ పిల్లలను ఎగతాళి చేయకూడదని తెలిపారు. ప్రతి వ్యక్తిలో ఏదో ఒక నైపుణ్యం దాగి ఉంటుందన్నారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి సురేందర్ మాట్లాడుతూ సివిల్స్ ర్యాంకు సాధించడం ఎంతో కష్టమైన విషయమని, అది తాను స్వయంగా అనుభవించానన్నారు. పేదరికంలో ఉన్నామంటూ ఎవరు కూడా అధైర్యపడకుండా రేవయ్యను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. అనంతరం రేవయ్యను, ఆయన తల్లిని ఘనంగా సన్మానించారు. రేవయ్య జిల్లాకు కలెక్టర్‌గా రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏపీడి శ్రీనివాస్, డిపిఎం యాదగిరి, రాజకుమార్, రామకృష్ణ, ఏపీఎం శ్రీనివాస్, జిల్లా మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

ఓసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- టీబీజీకేఎస్ కేంద్ర కమిటీ ఉపాధ్యక్షులు దీకొండ అన్నయ్య



నవతెలంగాణ-జైపూర్

ఇందారం ఓపెన్‌కాస్ట్ గని కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ టీబీజీకేఎస్ కేంద్ర కమిటీ ఉపాధ్యక్షులు దీకొండ అన్నయ్య డిమాండ్ చేశారు. శనివారం ఇందారం ఓసీ గని ఆవరణలో కార్మికులతో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో టీబీజీకేఎస్ నాయకులు మంద మల్లారెడ్డి, ఏనుగు రవీందర్‌రెడ్డితో కలిసి మాట్లాడారు. కార్మికుల సమస్యల పరిష్కారం విషయమై ఓసీ యాజమాన్యంతో చర్చించినట్లు తెలిపారు. తాగు నీటి వసతి మెరుగుపర్చడం, ఉద్యోగులకు మౌళిక వసతులు కల్పించడం, షెడ్ నిర్మాణం, ప్రస్తుతం ఉన్నటువంటి షెడ్డు పున:నిర్మాణం, నీటి పంపుల ఏర్పాటు షేడేలు 50 శాతం పెంపు, చార్జింగ్ అలవెన్సు పంపు ఆపరేటర్లకు ఇవ్వడం, డంపర్ శావల్స్ లోడర్స్‌లో ఏసీ సౌకర్యం, స్పెర్ పార్ట్స్ అందుబాటులో ఉంచడం తదితర విషయాలను ఓసీ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. సింగరేణి గని కార్మికుల చిరకాల స్వప్నం అయినటువంటి సొంతింటి పథకం విషయమై ప్రతి కార్మికునికి 2గుంటల ఇంటి స్థలంలో పాటు ఇంటి నిర్మాణం కోసం బ్యాంకు రుణం ఇవ్వాలని కోరుతూ టీబీజకేఎస్ ప్రభుత్వానికి ప్రతిపాదించినట్లు తెలిపారు. కోలిండియాలో లేనటువంటి మెడికల్ ఇన్వాల్యుడేషన్ పేరున కార్మికుల వారసులకు ఉద్యోగాలు, మహిళా డిపెండెంట్స్‌కు వికలాంగులకు ఉద్యోగ కల్పన, రూ.10లక్షల ఇంటి రుణం వడ్డీ రీయంబర్స్‌మెంట్, ఉచిత కరెంటు ఏసీ సౌకర్యం, ఉద్యోగి తల్లిదండ్రులకు కార్పొరేట్ వైద్యం, ఆర్జిత లాభాల్లో 30 శాతం వరకు లాభాలు అందించడం ఇలా అనేక ఎన్నో ఆర్థికపరమైన సంక్షేమ పరమైన హక్కులను సింగరేణి కార్మికులకు అందించిన సీఎం కేసీఆర్ వచ్చే నెల 9న మంచిర్యాలకు వస్తున్నట్లు తెలిపారు. మంచిర్యాలలో ఏర్పాటు చేస్తున్న భారీ బహిరంగ సభకు కార్మికులు పెద్దఎత్తున తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో టీబీకేఎస్ నాయకులు చాట్ల అశోక్, కానుగంటి చంద్రయ్య, జగదీశ్వర్‌రెడ్డి, ఇందారం ఓసీ పిట్ కార్యదర్శి రత్నాకర్‌రెడ్డి, ఐకే1ఏ గని పిట్ కార్యదర్శి గడ్డం మల్లయ్య, గోగర్ల గోపాల్, బోడకుంట తిరుపతి, రాజిరెడ్డి, రాజ్‌కుమార్, మనోహర్, హన్మంతు, భార్గవరెడ్డి పాల్గొన్నారు.

జీలుగు విత్తనాల పంపిణీ



నవతెలంగాణ- జన్నారం

పొన్కల్ పీఏసీఎస్‌లో శనివారం రైతులకు జీలుగు విత్తనాలను ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు విత్తనాలను సరైన మోతాదులో అందించాలన్నారు. వీటి ద్వారా భూమి సారవంతం అవుతుందని పేర్కొన్నారు. పచ్చి రొట్టె ఎరువులతో భూమిలో పోషకాలు పెరిగి రైతులకు అధిక దిగుబడి వస్తుందన్నారు. ప్రతి రైతు తప్పకుండా వారి పొలాల్లో పచ్చిరొట్ట ఎరువులు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుతారి వినయ్ కుమార్, కో ఆప్షన్ సభ్యులు మున్వార్ అలీ ఖాన్, పిఏసిఎస్ చైర్మన్ శీలం రమేష్,, పార్టీ మండల అధ్యక్షుడు గుర్రం రాజారాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి సులువ జనార్దన్, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు రియాజుద్దీన్ సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు గంగాధర్, జిల్లా అధికార ప్రతినిధి సిటీ మల్ల భరత్‌కుమార్, స్థానిక సర్పంచి జక్కు భూమేష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు బుచ్చన్న, సతీష్, ఏఈఓ సంధ్య మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-లక్షెట్టిపేట్

బీటీఎస్ఎల్ సొల్యూషన్స్ సంస్థ హైదరాబాద్ ఆధ్వర్యంలో పట్టణంలోని కళాంజలి మినీ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఉదయం 9 గంటలకు నిర్వహించబోయే జాబ్ సెమినార్‌కు సంబంధించిన వాల్ పోస్టర్‌ను శనివారం ఎస్సై లక్ష్మణ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ పరిసర ప్రాంత విద్యార్థి, విద్యార్థులు,నిరుద్యోగులు బీటీఎస్ఎల్ సొల్యూషన్స్ హైదరాబాద్ సంస్థ నిర్వహిస్తున్న జాబ్ సెమినార్‌ని సద్వినియోగం చేసుకుని చదువుకు తగిన ఉద్యోగాల్ని ఎంచుకొని ప్రయోజకులు కావాలని సూచించారు. అనంతరం సంస్థ సిఈఓ, ఫౌండర్ దుంపల సన్నీ మాట్లాడుతూ ఇంటర్మీడియట్, డిగ్రీ పాస్,ఫెయిల్ అయినా విద్యార్థులు అందరు అర్హులే అన్నారు. రిజిస్ట్రేషన్ కోసం అరవింద్ కోలా 9000694173 సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో అడ్లూరి మధుకర్ , సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ పాల్గొన్నారు.

నూతన సమీకృత కలెక్టరేట్‌ను సందర్శించిన కలెక్టర్

నవతెలంగాణ-నిర్మల్

జూన్ 4న నూతన సమీకృత కలెక్టరేట్‌ను సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయనున్న సందర్భంగా శనివారం నూతన సమీకృత కలెక్టర్ భవనాన్ని జిల్లా కలెక్టర్ వరుణ్‌రెడ్డి, జిల్లా ఎస్పీ ప్రవీణ్ కుమార్‌తో కలిసి నిర్మాణం పనులను సందర్శించారు. సమీకృత కలెక్టర్ కార్యాలయ భవన నిర్మాణ సముదాయాలను నూతన కలెక్టరేట్ కాంప్లెక్స్‌లో కలియతిరుగుతూ నిర్మాణ పనులను పరిశీలించారు. భవనం ఆవరణలో జరుగుతున్న సుందరీకరణ, గార్డెనింగ్, హెలీప్యాడ్ తదితర పనులు సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. తుది మెరుగులు దిద్దే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని సూచించారు. ప్రాంగణంలో గార్డెనింగ్, మొక్కలు నాటడం సుందరీకరణ పనులు పెండింగ్ లేకుండా ముఖ్యంగా అన్ని చోట్ల మొక్కలు నాటాలని పచ్చదనంతో కూడిన ఆహ్లాదకరమైన వాతావరణం తలపించేలా మొక్కలు నాటాలని అన్నారు.

సీఎం కేసీఆర్ పర్యటించే రూట్‌మ్యాప్

ప్రారంభోత్సవం అనంతరం సభ నిర్వహించే స్థలాన్ని పరిశీలించారు. మరీ ముఖ్యంగా విద్యుత్ అంతరాయం కలగకుండా చూడాలని, మైక్ సిస్టంలో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని వీటిపైన మరింత ప్రత్యేక శ్రద్ధ కనబర్చి ఎలాంటి ఆటంకాలు కలగకుండా చూడాలని అన్నారు. కలెక్టర్ వెంట ఆర్ అండ్ బీ ఈఈ అశోక్, డీఎస్పీ జీవన్‌రెడ్డి, అధికారులు ఉన్నారు.

కాంగ్రెస్ ఐక్యత రాగంతో బీఆర్ఎస్ నాయకుల్లో వణుకు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ పెద్దలు, మాజీ మంత్రి చిల్కూరి రామచంద్రారెడ్డి చలువతో అందరూ ఏకతాటిపైకి వచ్చి కలిసి పనిచేస్తామని చెప్పగానే ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్నకు, నియోజకవర్గ అధికార బీఆర్ఎస్ నాయకుల వెన్నులో ఓటమి వణుకు మొదలయ్యిందని కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని డీసీసీ అధ్యక్షులు సాజిద్‌ఖాన్ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కచ్చితంగా ఈ సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చేతులలో ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న డిపాజిట్ గల్లంతు ఖాయమని అన్నారు. గత సాధారణ ఎన్నికల్లో ఆదిలాబాద్ నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామిని ఎమ్మెల్యే నెరవేర్చలేదని అన్నారు. నియోజకవర్గంలో గత కాంగ్రెస్ పార్టీ హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప ఎక్కడ ఎమ్మెల్యే చేసిన అభివృద్ధి లేదని ఎద్దేవా చేశారు. ఈసారి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులైనా సాజిద్‌ఖాన్, సుజాత, సంజీవ్‌రెడ్డిలలో ఎవరో ఒక్కరి చేతులో ఎమ్మెల్యే జోగు రామన్న ఓటమి తప్పదని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

అరెస్ట్ చేసిన వారిని బేషరతుగా విడుదల చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

తెలంగాణ ప్రభుత్వం మండలంలోని రేణుక సిమెంట్ ఫ్యాక్టరీ భూనిర్వాసితులకు న్యాయం చేయాలని తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షులు గోడం గణేష్ అన్నారు. శనివారం పోలీసులు అరెస్ట్ చేసిన ఆదివాసులను బేషరత్‌గా విడుదల చేయాలని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసులపై, ఆదివాసీ నాయకులను అరెస్ట్ చేసి అనేక పోలీస్ స్టేషన్లలో తిప్పుతూ వారిపై అక్రమ కేసులు పెట్టడం అప్రజాస్వామికమని అన్నారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. అరెస్ట్ చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని, లేనియెడల ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. మండలంలోని రామాయి, రాంపూర్ శివారంలోని సర్వే నెంబర్లు 29, 30, 31, 32, 33, 34, 107 ఎకరాల భూమిని ఆదివాసులకే అప్పగించాలని, లేనియెడల వాళ్ల భూమి వాళ్లకే తుడుం దెబ్బ ఆధ్వరంలో పంచుతామని అన్నారు. ఈ కార్యక్రంలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి పుర్క బాపూరావు, ఉపాధ్యక్షులు కుమురం శ్యామ్‌రావు, ప్రచార కార్యదర్శి వేట్టి మనోజ్, ఆదివాసీ మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెందూర్ పుష్పరాణి, విద్యార్థి సంఘం నాయకులు రాహుల్, సలాం వరుణ్, మెస్రం దినేష్, నాయకులు పాల్గొన్నారు.

జూన్ 8,9,10 తేదీల్లో ఫిష్ ఫుడ్ ఫెస్టివల్

నవతెలంగాణ-నిర్మల్

జూన్ 8,9,10 తేదీలలో నిర్మల్ పట్టణంలో ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి బి నరసింహారావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఫెస్టివల్‌లో చేపల పులుసు, చేపల ఫ్రై, ఫిష్ పకోడీ, ఫిష్ బిర్యానీ, ఫిష్ ప్రాన్స్, ఫిష్ కట్‌లెట్స్, ప్రాన్స్ పకోడీ తదితర వంటకాలు జిల్లా వాసులకు అందుబాటులో తెచ్చే విధంగా 10 ఫిష్ స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఈ వంటకాల మీద 20మంది మహిళలకు శిక్షణ ఇప్పించామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈ ఫెస్టివల్ నిర్వహించడం జరుగుతుందని, శిక్షణ పొందిన వారు ఈ స్టాల్ ఏర్పాటుకు ఐదు రోజులుగా మత్స్యశాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

పద్మ అవార్డులకు దరఖాస్తుల స్వీకరణ

ఆదిలాబాద్‌టౌన్: వివిధ రంగాలలో విశిష్టత సేవలందించిన వారికి భారత ప్రభుత్వం పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మ విభూషణ్ అవార్డులు ప్రదానం చేస్తున్నందున సంబంధిత రంగాలలో సేవలందించిన వారు దరఖాస్తులు చేసుకోవాలని డివైఎస్ఓ వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాకు చెందిన కళలు, సామాజిక కార్యక్రమాలు, పబ్లిక్ అఫైర్స్, సైన్స్ టెక్నాలజీ, ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ, లిటరేచర్, విద్య, క్రీడలు, సివిల్ సర్వీసులు తదితర అంశాలలో సాధించిన లక్ష్యాలను చేసిన కృషిని 800 పదాలు మించకుండా ఈ నెల 30 లోపు పద్మఅవార్డ్స్.గౌ.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. నమోదు చేసుకున్న సమాచారాన్ని యువజన, క్రీడల అధికారి కార్యాలయంలో అందజేయాలన్నారు.

విశ్వకర్మ విశ్వబ్రాహ్మణుల సమస్యలను తీర్చుకుందాం

బోథ్: విశ్వకర్మ విశ్వ బ్రాహ్మణుల సంక్షేమ అభివృద్ధితో పాటు వారి సమస్యలను తీర్చుకుందామని సంఘం జిల్లా అధ్యక్షుడు సామాన్‌పెల్లి నర్సింలు అన్నారు. శనివారం మండల కేంద్రంలో జూన్ 6న జరిగే భారీ బహిరంగ సభ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో గాయత్రి గార్డెన్‌లో నిర్వహించే సభలకు విశ్వకర్మ విశ్వబ్రాహ్మణుల సంఘం నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు, ప్రతిఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం బోథ్ సర్పంచ్ సురేందర్‌యాదవ్ మాట్లాడుతూ. మండలంలోని విశ్వకర్మ విశ్వ బ్రాహ్మణుల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అజయ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మీసాల స్వామి, కోశాధికారి దశరథ్, పీఏసీఎస్ చైర్మెన్ కదం ప్రశాంత్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మెడ్పేల్మ ప్రవీణ్, సభ్యులు రవీందర్, శ్రీకర్, రంగు రాజు, రూపేష్, ప్రసాద్, వడ్ల లక్ష్మణ్, ఈశ్వర్, సభ్యులు పాల్గొన్నారు.

సుహాసినిరెడ్డికి వైద్య పరీక్షలు.. మేజిస్ట్రేట్ ముందు హాజరు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ రూరల్ మండలంలో రేణుకా సిమెంట్ పరిశ్రమ భూ నిర్వాసితులకు న్యాయం చేయాలని రైతులతో కలిసి ఆందోళన చేపట్టిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసినిరెడ్డిని పోలీసులు శనివారం ఉదయం అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆమెకు రిమ్స్‌లో పోలీసులు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆమెను ఉట్నూర్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు.